


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 326, పేజీలు - 08

శనివారం, ఏప్రిల్ 19, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

# హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్

- రేవంత్ సర్కార్ మరో గేమ్ ఛేంజర్ డీల్
- 10,500 కోట్ల పెట్టుబడులకు ఎన్టీటీ డేటా
- నెయిసా త్రైపాక్షిక ఒప్పందం





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనలో రెండో రోజు కూడా కీలక సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. హైదరాబాద్‌లో ఉన్న మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్న జపాన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. మొదటి రోజు మారుబెనీ సహా పెద్ద పెద్ద కంపెనీలతో ఒప్పందం జరిగితే రెండో రోజు కూడా అదే జోరు కొనసాగింది. తెలంగాణలో కొత్త నిర్మించబోతున్న ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగం పంచుకునేందుకు చాలా కంపెనీలు ఉత్సాహం చూపుతున్నాయి. ఎన్‌టీటీ డేటా, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్‌క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్ వర్క్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచంలో పేరొందాయి ఈ సంస్థలు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి దాదాపు రూ. 10,500 కోట్ల పెట్టుబడితో ఈ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నాయి. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్ నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా, డైరెక్టర్ తడావోకి

2లో..

# మే 1 నుంచి జీపీఎస్ టోల్ విధానం అమలు

### - క్లారిటీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ** కొత్త టోల్ విధానం గురించి పెద్ద ఎత్తున వార్తలు వస్తుండగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలంతా గందరగోళానికి గురవుతున్నారు. ముఖ్యంగా మే 1వ తేదీ నుంచి ఫాస్టాగ్ టోల్ వ్యవస్థ స్థానంలో శాటిలైట్ ఆధారిత టోల్ విధానం అమలు కాబోతుందని అంతా చెబుతుండగా దీనిపై తాజాగా కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ శుక్రవారం రోజు స్పష్టం చేసింది. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న ఫాస్టాగ్ టోల్ విధానమే కొనసాగబోతున్నట్లు అర్థం అవుతుంది. గత రెండు మూడు రోజులుగా కొత్త టోల్ విధానంపై పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం కొనసాగుతున్న ఫాస్టాగ్ టోల్ విధానం స్థానంలో శాటిలైట్ టోల్ విధానాన్ని తీసుకురాబోతున్నారని మే 1వ తేదీ నుంచే అమలు చేయబోతున్నారంటూ చెప్పుకొచ్చారు. ముఖ్యంగా టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆపాల్సిన అవసరం లేకుండా ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నేషన్ విధానాన్ని తొలుత ఎంపిక చేసిన టోల్ ప్లాజాల వద్ద ఫిక్స్ చేస్తారని వివరించారు. ఇందులో ఏఎన్‌పీఆర్‌తో పాటు ఫాస్టాగ్‌ను కలిసి సేవలు అందిస్తారని వార్తల్లో రాసుకొచ్చారు. ఇలా ఏఎన్‌పీఆర్ కెమెరాలు వాహనం నంబర్ ప్లేట్లను గుర్తిస్తే వాహనాలను ఆపాల్సిన అవసరం లేకుండానే ఫాస్టాగ్ రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ద్వారా టోల్‌ని వసూలు చేయవచ్చని చెప్పుకొచ్చారు. అలాగే ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినా ఈ-నోటీసులు జారీ చేయవచ్చని స్పష్టం చేశారు. దీని ద్వారానే సదరు వాహన

2లో..

# కంచ గచ్చిబౌలి భూములపై వెంటనే విచారణ చేపట్టాలి

### - కేంద్రం పై కేటీఆర్ ఒత్తిడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో బీఆర్ఎస్ దూకుడు పెంచింది. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేలా అడుగులు వేస్తోంది. రీసెంట్ ప్రెస్ మీట్ లో కేంద్రం జోక్యం చేసుకోవాలంటూ డిమాండ్ చేసిన కేటీఆర్ లేటెస్ట్ గా ప్రధాని మోదీని ట్యాగ్ చేస్తూ కీలక ట్వీట్ చేశారు. హెచ్సీయూ భూవివాదంలో కలుగ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణంపై ప్రధానిగా తన చిత్తశుద్ధి నిరూపించుకోవాల్సిన సమయం ఇది అన్నారు. కంచ గచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై విచారణ చేపట్టి కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కంచ గచ్చిబౌలిలో జరిగిన విధ్వంసం విషయంలో తన చిత్తశుద్ధి నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు కేటీఆర్. రేవంత్ రెడ్డి చేసిన విధ్వంసం పైన ప్రధాని మాట్లాడింది కేవలం బూటకం కాకుంటే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ ఇంకా ఏమన్నారంటే "కంచ గచ్చిబౌలి అంశం కేవలం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన 10వేలకోట్ల ఆర్థిక మోసం.

2లో..

# టోక్యో నుంచి చాలా నేర్చుకున్నా

- జపాన్ రోడ్‌షోలో రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజధాని హైదరాబాద్ అభివృద్ధికి జపాన్ రాజధాని టోక్యో నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జపాన్ పర్యటనలో ఉన్న ఆయన టోక్యోలో నిర్వహించిన భారత్-జపాన్ భాగస్వామ్య రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత్, జపాన్ దేశాలు కలిసి ప్రపంచానికి

2లో..

# ప్రతినెలా 3వ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

### - ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సీఎం పిలుపు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఈసారి 'ఈ-వ్యర్థాల సేకరించి వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడం థీమ్'ను ఎంచుకున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా సర్క్యులర్ ఎకానమీ సాధ్యం అవుతుందని వెల్లడించారు. స్వర్ణాంధ్ర-2047 సంకల్పంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రతి నెలా 3వ శనివారం రోజు జరుపుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రతి కార్యక్రమం స్ఫూర్తివంతంగా ఉండేందుకు నెల నెలా ఒక్కో థీమ్ను ఎంచుకుని నిర్వహిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎన్జీఓలు, కార్పొరేట్ సంస్థలు, విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఎక్కడికక్కడ ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయండని సూచించారు. వీటి నిర్వహణకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎస్‌హెచ్‌జీ సభ్యులను గుర్తించి వారి సేవలను వినియోగించుకోవాలని అన్నారు. రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ అనేది ఈ - వేస్ట్ కలెక్షన్ సెంటర్ల నినాదం కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసి తద్వారా స్వర్ణాంధ్ర సంకల్పాన్ని మరింత ముందుకు వెళ్లే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుతారని ఆశిస్తున్నట్లు సీఎం చంద్రబాబు అన్నారు.

### - స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం

గత 6 నెలలుగా స్వచ్ఛ స్వచ్ఛ ఆంధ్ర దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ప్రతి నెల 3వ శనివారం క్రమం తప్పకుండా ఒక్కొక్క థీమ్తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. నేడు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి మంత్రి దిశా నిర్దేశం చేశారు. టెలికాన్ఫరెన్స్‌కు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, స్వచ్ఛఆంధ్ర ఎండీ అనిల్ కుమార్ రెడ్డి, అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు హాజరయ్యారు. నేడు ఇ- చెక్ అనే థీమ్తో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. షాపులు, ఇళ్లలో ఉన్న ఎలక్ట్రానిక్ వేస్ట్ను పూర్తిగా సేకరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలతో కలిసి అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

# బిగ్ బాస్ ఎవరనేది రాజ్ కసిరెడ్డినే అడగాలి

- మద్యం కేసులో ముగిసిన విజయసాయిరెడ్డి విచారణ
- విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన మాజీ ఎంపీ
- విజయసాయిని 3 గంటల పాటు విచారించిన సిట్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ కేసులో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సిట్ విచారణ ముగిసింది. దాదాపు 3 గంటల పాటు ఆయనను సిట్ అధికారులు విచారించారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనను సిట్ అధికారులు నాలుగు విషయాల గురించి అడిగారని తెలిపారు. తాను ఇచ్చిన సమాధానాలతో వారు తృప్తి చెందారనే అనుకుంటున్నానని చెప్పారు. గతంలో జరిగిన రెండు సమావేశాల గురించి అడిగారని ఆ రెండు సమావేశాలు ఎక్కడ జరిగాయి, ఏం చర్చించారు, ఎవరెవరు పాల్గొన్నారని అడిగారని విజయసాయి తెలిపారు.

2లో..

# కూటమి నేతలకు పవన్ కల్యాణ్ వార్నింగ్

### - భూ బాధితుల నుండి స్వయంగా అర్జీలు స్వీకరిస్తానన్న పవన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. భూ బాధితుల కోసం తానే స్వయంగా రంగంలోకి దిగుతానని స్పష్టం చేశారు. భూ బాధితులకు సంబంధించిన ఫిర్యాదులను తానే స్వయంగా పరిశీలిస్తానని అన్నారు. అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్ లో ఈమేరకు పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భూదందాల బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తామని అంతేకాదు ఫిర్యాదులను తానే స్వయంగా పరిశీలిస్తానని పవన్ ఈ మీటింగ్ లో చెప్పారు. కూటమి పాలన పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగుతోందని అన్నారు. ప్రజలను ఇబ్బందిపెడితే కూటమి నేతలనూ ఉపేక్షించనని పవన్ కల్యాణ్ ఈమేరకు హెచ్చరించారు. భూ బాధితులకు జరిగిన అన్యాయాలపై స్వయంగా తానే రంగంలోకి దిగుతున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. ఇక నుంచి భూ సమస్యలపై స్వయంగా తానే జిల్లాలకు వెళ్లి అర్జీలు స్వీకరించేందుకు కసరత్తులు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటి నుంచే ప్రిపేర్ అవుతున్నారు. అలాగే కబ్జాలకు పాల్పడిన ఎవరినైనా సరే శిక్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ విషయాన్ని తాజాగా అధికారులతో జరిగిన టెలీ కాన్ఫరెన్స్ లో పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అయితే ఇటీవల కాలంలో భూ కబ్జాలకు సంబంధించిన సమస్యలు రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్నాయి. దీంతో ఆయన ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

### - పవన్ దాతృత్వం..

ఇటీవల ఉగాది పర్వదినం సందర్భంగా పిఠాపురంలో 10వేల మంది మహిళలకు పవన్ కల్యాణ్ చీరలను పంపిణీ చేశారు. తనను ఆదరించి గెలిపించినందుకు ప్రతి కుటుంబానికి తాను పసుపు

2లో..

# ఉదయం ఉక్కపోత సాయంత్రం కుండపోత

### - హైదరాబాద్ సహా తెలంగాణలో 3 రోజుల వెదర్ రిపోర్ట్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ వాతావరణం చాలా వైవిధ్యంగా మారుతోంది. శుక్రవారం ఉదయం నుంచి సూర్యుడు నిప్పులు కురిపించాడు. సాయంత్రానికి వరుణుడు వచ్చి వడగళ్ల వానతో వాతావరణాన్ని చల్లబరిచాడు. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం నగరాన్ని ముంచేసింది. చాలా ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఆఫీస్‌ల నుంచి వచ్చే టైం కావడంతో జనం ఇబ్బంది పడ్డారు. హైదరాబాద్‌లోని మాదాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, ఫిలింనగర్, గచ్చిబౌలి, అత్తాపూర్, నార్సింగి, కోకాపేట్, కోఠి, నాంపల్లి, అబిడ్స్ ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, రాజేంద్రనగర్, అంబర్‌పేట్, ఉప్పల్, సికింద్రాబాద్, కాచిగూడ, నారాయణగూడ, చిక్కడపల్లి, హయత్‌నగర్ వర్షం కుమ్మేసింది. దాదాపు హైదరాబాద్ వ్యాప్తంగా అరగంటపాటు వర్షం కురిసింది. ఈ వర్షంతో మహానగరం అతలాకుతలమైపోయింది. ఉరుములు మెరుపులు, ఈదురుగాల్పులతో కూడిన వర్షం వణికించింది. బస్సులు, కార్లు, వాహనాలు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పలు ప్రాంతాల్లో

2లో..

# రేవంత్ 'యంగ్ ఇండియా' బ్రాండ్‌కు బండి కౌంటర్

- యంగ్ ఇండియా పేరుతో నెహ్రూ కుటుంబం రూ. 2 వేల కోట్లు దోచుకుందని ఆరోపణ
- రేవంత్ రెడ్డి ఫోర్త్ సిటీ పేరుతో రూ. 50 వేల కోట్ల దోపిడీకి కుట్ర చేశారని విమర్శలు
- ఓ బ్రాండ్ కావాలనుకుంటే దాని పూర్వాపరాలు తెలుసుకోవాలన్న బండి సంజయ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తన బ్రాండ్ 'యంగ్ ఇండియా' అన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో కూడా యంగ్ ఇండియా అని అంటున్నారని, ఆయనకు స్ఫూర్తి కూడా 'యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' అని చెబుతున్నారని విమర్శించారు. యంగ్ ఇండియా పేరుతో నెహ్రూ కుటుంబం రూ. 2 వేల కోట్లు దోచుకున్నారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి ఫోర్త్ సిటీ పేరుతో రూ. 50 వేల కోట్ల దోపిడీకి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. యంగ్ ఇండియా బ్రాండ్ పేరుతో ఇక్కడి పేదల ఆస్తులు కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని

2లో..

## మే 1 నుంచి జీపీఎస్ టోల్ విధానం అమలు

దారులకు ఫాస్టాగ్ రద్దు, పెనాల్టీలు విధించబోతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా ఉండేందుకే ఈ కొత్త పాలసీని తీసుకొస్తున్నట్లు మంత్రిత్వ శాఖ గతంలోనే పేర్కొంది. కానీ దీన్ని ఎప్పుడు అందుబాటులోకి తీసుకు వస్తుందనే దానిపై మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. అయితే తాజాగా మే 1వ తేదీ నుంచే దీన్ని అమలు చేయబోతున్నారంటూ పెద్ద ఎత్తున వార్తలు రాగా ప్రజలు, వాహనదారులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. ఈక్రమంలోనే కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ విధానాన్ని తీసుకొచ్చేది నిజమే అయినా ఎప్పుడు అమలు చేయాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేమని వివరించింది. దీనిపై నిర్ణయం తీసుకుంటే తామే అధికారికంగా ప్రకటిస్తామని అప్పటి వరకు ఫాస్టాగ్ టోల్ విధానమే కొనసాగుతుందని చెప్పుకొచ్చింది.

## కంచ గచ్చిబౌలి భూములపై వెంటనే విచారణ చేపట్టాలి

ఇప్పటికే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సిబిఐ ఆర్బీఐ సెబి, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్ సంస్థలకు ఆధారాలతో సహా కాంగ్రెస్ చేసిన పదివేల కోట్ల ఆర్థిక మోసం గురించి తెలియజేశాం. సుప్రీంకోర్టు పంపించిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ కూడా ఈ అంశంలో ఆర్థిక అవకతవకలు జరిగిన అంశాన్ని నిర్ధారించింది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థల విభాగాల స్వతంత్ర విచారణ చేయాలని సూచించింది. నగరాలు వేగంగా విస్తరిస్తున్న ఈ తరుణంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం అయితే నిస్సిగ్గుగా, అక్రమంగా వ్యవస్థలను మోసం చేసి పర్యావరణాన్ని విధ్వంసం చేసిన రేవంత్ రెడ్డి లాంటి నాయకులను ప్రజల ముందు నిలబెట్టాల్సిన అవసరం ఉందన్నారు కేటీఆర్. ఈ అంశంలో బీజేపీ ఎంపీ ఒకరు కూడా పాలుపంచుకున్నారని ఆ పేరును త్వరలోనే బయటపెడతామని కేటీఆర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు స్పందించకపోతే బీజేపీ చిత్తశుద్ధి లేదని ప్రజలు భావిస్తారని అన్నారు కేటీఆర్. ఈ అంశంపై బీఆర్ఎస్ న్యాయపోరాటం కొనసాగిస్తుందని అవసరం అయితే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన తమకు లేదన్న కేటీఆర్ అవసరం అయితే ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేస్తారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలే ఆగ్రహంగా ఉన్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చెప్పింది నిజమేనన్నారు. అవసరం అయితే ప్రజలు చందాలు ఇచ్చి మరీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొడతారు కానీ రేవంత్ రెడ్డి ఐదేళ్లపాటూ సీఎంగా ఉండాలని తాను కోరుకుంటున్నా అన్నారు. అలా అయితేనే ఇంకో 20 ఏళ్ల వరకూ ప్రజలెవ్వరూ కాంగ్రెస్ వైపు చూడకుండా,ఓటేయకుండా ఉంటారు. ఈ దిక్కుమాలిన ప్రభుత్వాన్ని కూలగొట్టే ఆలోచనే తమకు లేదన్నారు కేటీఆర్. ముఖ్యమంత్రి రేవంత్ కి దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా గ్రామాల్లోకి వస్తే జనం అభిప్రాయం ఏంటో అర్థమవుతుందన్నారు. కొందరు పోలీసులు రేవంత్ రెడ్డి సైన్యంలా పనిచేస్తున్నారని ఆరోపించిన కేటీఆర్ ఇష్టానుసారం కేసులు నమోదు చేస్తే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. రీ ట్వీట్ చేసినా కూడా కేసులు పెట్టడం దుర్మార్గం కాక మరేంటని క్వశ్చన్ చేశారు. పోలీసులు తమ బాధ్యతలు మరిచి రేవంత్ రెడ్డి సైన్యంలా పనిచేస్తే ఊచలు లెక్కెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు కేటీఆర్. తెలంగాలో ఉన్న వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు,బిల్డర్లు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్ల అసంతృప్తిగా ఉన్నారని..ప్రభుత్వాన్ని కూల్చేయాలంటూ తమకు సలహాలు ఇస్తున్నారని కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. దీనిపై కాంగ్రెస్ నేతలు గట్టిగానే కౌంటర్ ఇవ్వడంతో ప్రభాకర్ మాట మార్చారు ప్రభుత్వాన్ని కూల్చాలనే ఆలోచన తమకు లేదన్నారు.

## టోక్యో నుంచి చాలా నేర్చుకున్నా

ఒక అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. జపాన్ పర్యటనలో రేవంత్ రెడ్డి బృందం పలు దిగ్గజ కంపెనీలతో సమావేశమైంది. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని జపాన్ పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆయా రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు. లైఫ్ సైన్సెస్, జీసీసీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు తెలిపారు. ఈవీ, టెక్స్‌టైల్స్, ఏఐ, డేటా సెంటర్లు, లాజిస్టిక్స్‌లో పెట్టుబడులను ఆహ్వానించారు.

## బిగ్ బాస్ ఎవరనేది రాజ్ కసిరెడ్డినే అడగాలి

తొలి సమావేశం హైదరాబాద్ లో, రెండో సమావేశం విజయవాడలో జరిగిందని సమావేశాల్లో లిక్కర్ పాలసీపై చర్చించామని చెప్పానని వెల్లడించారు. ఈ సమావేశాల్లో వాసుదేవరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, సత్య ప్రసాద్, సజ్జల శ్రీధర్ పాల్గొన్నారని చెప్పానని తెలిపారు. కిక్ బ్యాక్స్ గురించి అడిగితే తెలియదని చెప్పానని అన్నారు. ఏ కంపెనీలనైనా సిఫారసు చేశారా? అని అడిగారని రెండు కంపెనీలకు సిఫారసు చేశానని చెప్పానని తెలిపారు. అదాన్ డిస్టిలరీకి రూ. 60 కోట్లు, డీకార్ట్ కంపెనీకి రూ. 40 కోట్లు అరబిందో కంపెనీ నుండి 12 శాతం వడ్డీతో రుణం ఇప్పించానని నిధుల వినియోగం గురించి తనకు తెలియదని చెప్పానని అన్నారు. ఆ ఫండ్స్ ఎలా వాడుకున్నారు, ఎలా రీఫండ్ చేశారనే విషయం రాజ్ కసిరెడ్డి మాత్రమే చెప్పగలరని తెలిపానని వెల్లడించారు. మద్యం అమ్మకాల విషయంలో తాను ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని చెప్పానని తెలిపారు. రాజ్ కసిరెడ్డి వసూలు చేసిన డబ్బులు ఎవరికి వెళ్లాయో తనకు తెలియదని చెప్పానని అన్నారు. అన్ని ప్రశ్నలకు రాజ్ కసిరెడ్డే సరైన సమాధానాలు చెబుతారని చెప్పానని తెలిపారు. రాజ్ కసిరెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నిస్తే అన్ని వివరాలు బయటకు వస్తాయని, విచారణకు మళ్లీ ఎప్పుడు పిలిచినా వస్తానని చెప్పానని తెలిపారు. లిక్కర్ స్కామ్ లో బిగ్ బాస్ ఎవరనేది రాజ్ కసిరెడ్డినే అడగాలని విజయసాయి చెప్పారు. 2017-18లో పార్టీలోకి రాజ్ కసిరెడ్డి వచ్చారని ఆయన చాలా తెలివైన క్రిమినల్ అని అన్నారు. ఆయన అలాంటి వాడు కాదనే తాను అయన్ను ఎంకరేజ్ చేశానని తెలిపారు. ఆయనకు ఎన్ఆర్ఐ విభాగం, ఆ తర్వాత ప్రశాంత్ కిశోర్ బాధ్యతలను అప్పగించానని కానీ ఆయన పార్టీని, ప్రజలను మోసం చేశారని అన్నారు. ఈ విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. జగన్ పక్కనున్న కోటరీ తనపై లేనిపోనివి చెప్పి ఆయన మనసు మార్చిందని విజయసాయి మండిపడ్డారు. కోటరీ వేధింపులు భరించలేకపోయానని వారి వల్ల ఎన్నో ఇబ్బందులు పడ్డానని చెప్పారు. వైసీపీలో తన నెంబర్ టూ స్థానం 2 వేల స్థానానికి పడిపోయిందని అన్నారు. వ్యవసాయం చేసుకుంటున్న వ్యక్తికి రాజకీయాలు ఎందుకని కొందరు వ్యాఖ్యానిస్తున్నారని తాను ఎంపీ పదవి కావాలని ఎప్పుడూ అడగలేదని చెప్పారు. తాను అడగకుండానే తనకు రాజ్యసభ పదవి వచ్చిందని తెలిపారు. మళ్లీ రాజకీయాల్లోకి రావాలనుకుంటే తనకు ఇతరుల అనుమతి అవసరం లేదని ప్రజలు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు రాజకీయాల్లోకి వస్తానని అన్నారు. వారి సొంత న్యూస్ ఛానల్లో తనపై వ్యంగ్యంగా కథనాలు రాస్తున్నారని విమర్శించారు.

## కూటమి నేతలకు పవన్ కల్యాణ్ వార్నింగ్

కుంకుమ కింద వీటిని పంపిస్తున్నట్టు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. తాను స్వయంగా ఆయన వెళ్లకపోయినా పార్టీ నాయకులతో పంపిణీ చేశారు. అదే విధంగా తన సొంత డబ్బులతో 345 మంది గిరిజనులకు పవన్ నాణ్యమైన పాదరక్షలు పంపిణీ చేశారు. ఇటీవల మన్యం జిల్లా పర్యటనలో భాగంగా కురిడి, పెదపాడు గ్రామాల్లో పర్యటించిన ఆయన.. అక్కడి ప్రజలకు కనీసం చెప్పులు లేవని గ్రహించారు. దీంతో పవన్ వారికి చెప్పులు కొని అధికారుల ద్వారా పంపిణీ చేశారు. దీంతో ఆ గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## ఉదయం ఉక్కపోత సాయంత్రం కుండపోత

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. చెట్లు పడటంతో మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. వర్షం జోరుగా పడటంతో అధికారులు చేపట్టే సహాయక చర్యలకు కూడా త్వరగా పూర్తి కాలేదు. వర్షం తగ్గిన తర్వాత పనులు పూర్తి చేశారు. హైదరాబాద్‌లోనే కాకుండా తెలంగాణలో చాలా జిల్లాల్లో జోరువానలు కురిశాయి. సిద్ధిపేట, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వడగళ్లవాన ప్రజలను భయపెట్టింది.

ఈ అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. గత నెల రోజు నుంచి రోజూ ఏదో ప్రాంతంలో కురుస్తున్న వడగళ్ల వాన పంటలకు నష్టాన్ని కలిగిస్తోంది.
మహారాష్ట్ర నుంచి అంతర్గత కర్ణాటక, రాయలసీమ, తమిళనాడు మీదుగా గల్ఫ్ మన్నార్ వరకు ఏర్పడిన ద్రోణి ఈ వాతావరణానికి కారణమవుతోంది. మరో మూడు రోజులు తెలంగాణలో ఇలాంటి పరిస్థితే ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు ఠారెత్తిస్తాయి. సాయంత్రానికి ఉరుములు మెరుపులు, పిడుగులు, వడగళ్ల వాన దంచి కొట్టబోతోంది. అందుకే మూడు రోజుల పాటు పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ అలర్ట్ జారీ చేసింది.

## రేవంత్ ‘యంగ్ ఇండియా’ బ్రాండ్‌కు బండి కౌంటర్

మండిపడ్డారు. గతంలో నెహ్రూ కుటుంబం కూడా అదే పేరుతో కొల్లగొట్టిందని అన్నారు. ఎవరైనా ఓ బ్రాండ్ కావాలనుకున్నప్పుడు గతంలో ఆ బ్రాండ్‌కు ఉన్న పూర్వాపరాలు, పరపతి ఏమిటో తెలుసుకోవాలని సూచించారు. కానీ అవినీతి, అక్రమాలకు పాల్పడిన బ్రాండ్ పేరుతో ముందుకు వస్తే ప్రజలకు గతంలో చేసిన అక్రమాలు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసుతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. 2011లో యూపీఏ ప్రభుత్వం హయాంలోనే ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ప్రారంభమైందని గుర్తు చేశారు. కేసు నమోదైన సమయంలోనే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ బెయిల్ పొందారని తెలిపారు. కాబట్టి ఈ కేసుతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి భారతీయ చట్టాలు వర్తించవా అని నిలదీశారు. వక్ఫ్ సవరణ బిల్లుపై తెలంగాణలోనూ బెంగాల్ తరహా ఆందోళనలకు అవకాశం ఉందని బండి సంజయ్ హెచ్చరించారు. నిరసనలు హద్దులు దాటితే హింసకు దారితీస్తాయని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా జరుగుతోన్న నిరసనలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్

నిషిమురా, ఎన్టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బజ్‌పాయ్, నెయిసా సీఈవో, ఎన్టీటీ గ్లోబల్ డేటా ఛైర్మన్ శరద్ సంఘీ ఈ ఒప్పందంలో పాల్గొన్నారు.

**- దేశంలో అతిపెద్ద ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయం**

హైదరాబాద్‌లో 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నారు. 25,000 జీపీయూలతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు సమకూర్చనున్నారు. దేశంలో తెలంగాణను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుంది. ఎన్‌టీటీ డేటా, నెయిసా కంపెనీలు సంయుక్తంగా ఏఐ-ఫస్ట్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు ఈ క్లస్టర్ కొత్త ఆవిష్కరణల కేంద్రంగా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తు మిశ్రమంతో ఈ క్లస్టర్ నిర్వమిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంభిస్తారు. ఈ ప్రాజెక్లును అత్యున్నత ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదం చేస్తుంది.
ఈ భారీ పెట్టుబడుల ఒప్పందంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని అన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వీటితోపాటు రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఎడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ, టిల్‌మన్ హెూల్డింగ్స్, సీటీఆర్ఎల్ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని అన్నారు. టోక్యోలో ప్రధాన కార్యాలయం కలిగిన ఎన్‌టీటీ డేటా, ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్‌లో పేరొందిన కంపెనీ. 50 కంటే ఎక్కువ దేశాల్లో 193,000 మంది ఉద్యోగులతో, ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఈ కంపెనీ ఒకటి. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం వంటి రంగాలకు ఈ సంస్థ సేవలు అందిస్తుంది. నెయిసా నెట్ వర్క్ ఏఐ-ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ, నిర్దిష్ట ఏఐ కంప్యూట్ సొల్యూషన్స్‌ను అందించటంపై ఈ కంపెనీ దృష్టి పెడుతుంది.

## కొమిరెడ్డి రాములు, జ్యోతక్కల జ్ఞాపకార్థం మెగా వైద్య శిబిరం

మెట్ పల్లి మాజీ ఎమ్మెల్య కోమిరెడ్డి రాములు, జ్యోతక్క గారల జ్ఞాపకార్థం ఆదివారం రోజున మెగా హెల్త్ క్యాంపు నిర్వహించబడును. మెట్ పల్లి పట్టణంలోని స్థానిక సాయి శ్రీనివాస హాస్పిటల్ మరియు కాంటినెంటల్ హాస్పిటల్ గచ్చిబౌలి హైదరాబాద్ వారు సంయుక్తంగా నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నియోజకవర్గంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సాయి శ్రీనివాస హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ బెజ్జారపు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మెట్ పల్లిలోని కొమిరెడ్డి నివాస పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ, కొమిరెడ్డి రాములు కుటుంబంతో తమకు వ్యక్తిగతంగా, రాజకీయంగా ఉన్న సుదీర్ఘకాల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయాలలో తనను నిరంతరం వెన్ను తట్టి ప్రోత్సహిస్తూ, తమ ఎదుగుదలకు కృషి చేసిన రాజకీయ గురువు కొమిరెడ్డి రాములని, మరోవైపు తనకు వృత్తిపరంగా వ్యక్తిగత తోడ్పాటునందించి తాను జీవితంలో స్థిర పడడానికి తోడ్పడ్డారని కొనియాడారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన రాములు ఉన్నత విద్యనభ్యసించి న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ రాజకీయాలలో ప్రవేశించారని, విద్యార్థి దశ నుండే తొలి దశ తెలంగాణ పోరాటానికి నాయకత్వం వహించి, అప్పటి ప్రభుత్వం చే అరెస్టయి జైలు జీవితం గడిపారని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పరితపించిన కొమిరెడ్డి రాములు, శాసన సభ్యునిగా కొనసాగిన కాలంలో అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి హాయంలో నియోజకవర్గంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఎనలేని అభివృద్ధి చేశారని అన్నారు. రాములు ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి ప్రవేశించి ఎంపీపీ గా గెలిచిన జ్యోతక్క అనంతరం 1998 లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి శాసనసభ లో అడుగుపెట్టారని అన్నారు. దంపతులిరువురు ఎమ్మెల్యేలుగా ఈ ప్రాంతంలో ఎంతో ఎత్తుకు ఎదిగి అభివృద్ధిలో తమదైన ముద్ర వేశారని వారు లేని లోటు వ్యక్తిగతంగా తమకే కాకుండా ఈ ప్రాంతానికి తీరని లోటని అన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం తాము నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలు గతంలో కొమిరెడ్డి రాములు, జ్యోతక్కల చేతులమీదుగా ప్రారంభించే వాడినని, ప్రస్తుతం వారు లేకుండా వారి స్మారకార్థం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించవలసి రావడం తమను బాధకు గురి చేస్తోందంటూ శ్రీనివాస్ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.

## చర్చి పైనుంచి కిందపడి యువకుడు మృతి

అనంతపురం అనంతపురం జిల్లా తాడిపత్రిలోని నందలపాడులో చర్చి పైనుంచి కిందపడి యువకుడు మృతి చెందాడు .తీవ్రగాయాలైన విక్టర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. విక్టర్‌కు మతిస్థిమితం లేదని స్థానికులు అంటున్నారు. పోలీసులు , కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోన ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ కు గవర్నర్ ఆమోదం తెలపడం హర్షనీయం

మంత్రాలయం నియోజకవర్గం, మంత్రాలయం మండలం వి. తిమ్మాపురం గ్రామంలో నేడు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కొరకు 30 ఏళ్ల పోరాటాలు చేసి ఎంతోమంది అమర వీరుల త్యాగ ప్రతిఫలానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, మరియు కూటమి నాయకులు 2024 సంవత్సరం ఎన్నికల ముందు, ఆమె ఇచ్చిన ప్రకారమే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2024 సంవత్సరం ఆగస్టు 1వ తేదీన,వీరి చొరవతో గౌరవ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ ఆయ రాష్ట్రాలు జనాభా దామాషా ప్రకారం చేసుకోవాలని తీర్పునివ్వడం జరిగింది. సుప్రీంకోర్టు తీర్పు అనుసారంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వన్ మ్యాన్ కమిషన్ రాజీవ్ రంజాన్ మిశ్రా ను నియమించి 26 జిల్లాల్లో ఉన్నటువంటి ఎస్సీ ఎస్టీ కులాల 360 పేజీలు నివేదికను తీసుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తే,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర యూనిట్ గా 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణకు ఆరుగురు మంత్రులను కమిటీని నియమించి ఎలాంటి అభ్యంతరాలు లేకుండా క్యాబినెట్ గ్రూప్ -ం రెల్లి ఉపకులాలు (12)కు = 1%, గ్రూప్ -ః మాదిగ ఉపకులాలు (18) కు= 6.5%, గ్రూప్ -ఇ మాల ఉపకులాలు (29)కు =7.5% మిగిలిన 0.5%ను 200 రోస్టర్ పాయింట్ లను రెండు దఫాలుగా ఎంపిక చేసి మొత్తం 15% రిజర్వేషన్ కు ఆమోదం తెలిపితే, వన్ మ్యాన్ కమిషన్ జాతీయ ఎస్సీ కమిషన్ కి పంపిస్తే,జాతీయ ఎస్సీ కమిషన్ గవర్నర్ కు పంపించడం జరిగింది.
వన్ మ్యాన్ కమిషన్ వారు ఎస్సీ వర్గీకరణకు చట్టం ద్వారా ఎలాంటి అభ్యంతరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకొని నిన్నటి దినమున ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్సు కు గవర్నర్ గెజిట్,జీవో నెంబర్ 19 ఆమోదం తెలిపి విడుదల చేపించడం, మాదిగలు జీవితాల్లో వెలుతురు వచ్చిందని మాట్లాడి, 17-04-2025 వ తేదీ నుండే మాదిగల ఉపకులాలకు ఉద్యోగ, విద్య,రాజకీయంగా, బ్యాక్ లాగ్ పోస్టులకు అవకాశాలు కల్పించడం నిజంగా ×ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారులకు రుణపడి ఉంటామని మాట్లాడి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని కమిషన్లు అన్ని సంఘాలు ఎస్సీ వర్గీకరణకు సహకరిస్తే,మాజీ ముఖ్యమంత్రి వర్యులు జగన్ మోహన్ రెడ్డి మాదిగలను కొంత మందిని కట్టు బానిసలుగా చేసుకొని అసత్య ప్రచారాలు చేపిస్తూ, మాదిగలను నిత్య మోసం చేస్తూ ఎస్సీ వర్గీకరణ గూర్చి మాట్లాడకుండా మౌనం పాటించి,మాలలకు వత్తాసు పలుకుతూ మాల సంఘ నాయకుడుగానే మిగిలిపోయాడని మాట్లాడడం జరిగింది.

## అంబేద్కర్ విగ్రహం ముందు దళితుల అందోళన

**యాప్రాల్** యాప్రాల్ అంబేద్కర్ విగ్రహం శిలాఫలకంపై పేరు చెడుపేయడంతో వివాదాస్పదంగా సంఘటన మారింది. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాప్రాల్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. అంబేద్కర్ విగ్రహం శిలాఫలకంపైన ఉన్న మాజీ ఎంపీ నంది ఎల్లయ్య పేరును కనపడకుండా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. నంది ఎల్లయ్య పేరును అక్సా బ్లేడ్, రాయితో కొట్టి చెరిపి వేశారని ఆరోపించారు. దళిత సంఘాలు అఖిలపక్ష నేతలంతా ఏకమై ధర్నా చేపట్టారు. దుశ్చర్యకు పాల్పడిన దుండగున్ని వెంటనే అరెస్ట్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## మోదీ దిష్టిబొమ్మ దగ్ధం

**మేడ్చల్** సోనియా గాంధీ,రాహుల్ గాంధీ లపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ ఈడీ విచారణ పేరుతో మోదీ సర్కార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతుందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. దానికి నిరసనగా రామంతపూర్ లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ నెహ్రూ ఫ్యామిలీపై ఈర్ష్య పెంచుకొని ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు అని మండిపడ్డారు.రాజ్యాంగ నిర్మాణంలో కూడా కాంగ్రెస్ పార్టీ నాయకుల పాత్ర కీలకం అలాంటి చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీపై,నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తూ,తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నం చేయడం మోదీ ప్రభుత్వానికి తగదు.కాబట్టి ఇలాంటి ప్రయత్నాలను మానుకోవాలని హెచ్చరించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపీపీ





**శిరివెళ్ల** సిరివెళ్ల సర్కిల్ పరిధిలోని యాలూరు సమీపంలో గల కేసీ కెనాల్ కట్ట వద్ద గల దేవస్థానంలో శుక్రవారం జరిగిన వివాహానికి హాజరై అశోక్ కుమార్, వెంకట సుధా నూతన దంపతులను శిరివెళ్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నాయక్ మహమ్మద్ వసీం వివాహానికి హాజరై ఆశీర్వదించారు. శిరివెళ్ల గ్రామానికి చెందిన సగ్గేల బాలుడు పద్మావతి దంపతుల కుమారుడు అశోక్ కుమార్ వెంకట సుధా వివాహం యాలూరు సమీపంలోని కేసీ కెనాల్ కట్ట మీద గల శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో జరిగింది. ఈ వివాహానికి హాజరై ఆశీర్వదించి నిండు నూరేళ్లు పిల్లాపాపలతో ఆదర్శ దంపతులుగా జీవనం సాగించాలని ఎంపీపీ కోరారు. ఈ వివాహ వేడుకలకు వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు బసాపురం అబ్దుల్ సలాం మాజీ జెడ్పీటిసి నాయక్ నజీర్ ఎంపీటీసీలు వార్డు సభ్యులు వైసిపి నాయకులు కార్యకర్తలు ఎంపీపీ వెంట ఉన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ, రాస్తారోకో

**- భారీ ఎత్తున తరలివచ్చిన ముస్లిం మైనారిటీలు, దళిత, ప్రజాసంఘాలు**



**కౌతాళం** కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మండల కేంద్రమైన కౌతాళంలో భారీ ఎత్తున శాంతియుత నిరసన ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు . శుక్రవారం ప్రత్యేక ప్రార్థన ప్రార్థనల అనంతరం కౌతాళం మండలం అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కౌతాళం తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని ముస్లిం సోదరులు, వామపక్ష పార్టీలైన సిపిఎం , సిపిఐ , రైతు కూలి సంఘం , ప్రజా సంఘాలైన జై భీమ్ , దళిత సమైఖ్య , ఎంఆర్పిఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే పట్టణ పురవీధుల గుండా శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైయస్సార్ సర్కిల్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌతాళం ఖాదర్ లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా సాహెబ్ , పీఠాధిపతి ఖాదర్ భాషా సాహెబ్ , అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్ , కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్ , సిపిఎం పార్టీ జిల్లా నాయకులు మల్లయ్య , సిపిఐ పార్టీ నాయకులు ఈరన్న , దళిత సమైఖ్య నాయకులు విజయకుమార్ కుమార్ , కౌతాళం మండలం జై భీమ్ అధ్యక్షులు అవతారం , ఎస్ ఎఫ్ ఐ మాజీ జిల్లా కార్యదర్శి వీరేష్ , జై భీమ్ నాయకులు జైపాల్ , అవాజ్ కమిటీ నాయకులు ఖాజా హుస్సేన్, గౌస్ మహమ్మద్ , మహమ్మద్ ఇషాఖ్, అబ్దుల్ సుఖుర్, అబ్దుల్ సమద్ తదితరు పాల్గొన్నారు. వక్ఫ్ సవరణ చట్టం వలన దేశ సమగ్రతకు ఐక్యతకు భంగం వాటికతోందని లౌకికవాదం పూర్తిగా నశిస్తుందని అందువల్ల ప్రతి ఒక్కరూ దీనిని వ్యతిరేకించాలని అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్ పిలుపునిచ్చారు.వక్ఫ్ బోర్డు కమిటీల్లో ముస్లిం యేతరులను నియమించడానికి చట్టం సవరణ చేయడం ఏమిటని హిందూ దేవాలయాల కమిటీల్లోను రాష్ట్ర కమిటీ లోను ముస్లింలకు, క్రైస్తవులకు , దళితులకు ప్రవేశం కల్పిస్తారని ప్రశ్నించారు. ముఖ్యంగా కేరళ , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మాత్రమే దేవాలయాలకు సంబంధించి 13 లక్షల ఎకరాలు భూమి ఉందని వాటి గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు కేవలం వక్ఫ్ బోర్డు పరిధిలో దేశవ్యాప్తంగా 9 లక్షల 50 వేల ఎకరాల భూమి ఉందని దానిని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని కార్పొరేట్ కంపెనీలకు పంచిపెట్టేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు.
ఇలాంటి వాటిని ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలని దేశంలోని లౌకిక వాదులైన హిందువులందరూ కలిసి రావాలని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొనాలని కోరారు. కౌతాళం దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల వరకు దేశంలో ముస్లింలు హిందువులు అన్నదమ్ముల్లా కలిసి కలిసి ఉండే వారిని అయితే నేడు కేంద్ర ప్రభుత్వం అగాధం పెంచిందని ఆరోపించారు.వక్ఫ్ సవరణ చట్టం చేయడం చాలా దారుణం అని దీన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం దేశంలోనే లౌకికవాదులైన హిందువులందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సభలో వాపక్ష పార్టీల నాయకులు దళిత సంఘాల ప్రజా సంఘాల నాయకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కౌతాళం , కోసిగి సీఐలు అశోక్ కుమార్ , మంజునాథ్ ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

**- నలుగురు ఏపీవాసులు దుర్మరణంబెంగళూరు**

కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదం లో నలుగురు ఏపీవాసులు దుర్మరణం పాలయ్యారు. ట్రక్కును బొలెరో వాహనం ఢీకొంది. దాంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు హిందూపురం వాసులుగా గుర్తించారు. హిందూపురం నుంచి కర్ణాటక యాద్గిర్ జిల్లా షహర్పూర్కు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మృతులు నాగరాజు, సోమ, నాగభూషణ్, మురళి.
వాటర్ స్కీం కి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి

## కావిడి. ఖాళీ బిందెలతో ఆదివాసి గిరిజనులు వినూత్నంగా ధర్నా

**అనకాపల్లి** అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ అజయ్ పురం గ్రామంలో 170 మంది జనాభా నివసిస్తున్నారు.2019-20 సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నిధులు నుండి 8 లక్షల 40 వేల రూపాయలు వాటర్ స్కీం ఏర్పాటు చేశారు. గత 15 రోజుల నుండి వాటర్ స్కీం కి విద్యుత్ సరఫరా లేకపోవడంతో. గ్రామంలో నీరు రావడం లేదు. దీనితో15 వ తేదీ ఆదివాసి గిరిజన మహిళలు వాటర్ ట్యాంక్ విక్కీ మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని. జల్జీవన్ మిషన్ ద్వారా వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలని ఆందోళన చేయడంతో. 16వ తేదీన పంచాయతీ కార్యదర్శి. ఆర్ డబ్ల్యూ ఎస్ జేఈ స్వయానా అజయ్ పురం గ్రామాన్ని వెళ్లి పరిస్థితి చేశారు. పంచాయతీ కార్యదర్శి గారు ఎలక్ట్రికల్ అధికారులకు వాటర్ స్కీం కి విద్యుత్ కనెక్షన్ ఇప్పించండి అని దరఖాస్తు పెట్టారు. నేటికీ విద్యుత్ అధికారులు స్పందించకపోవడంతో. అజయ్ పురం గ్రామం నుండి ఎర్ర కొండ దగ్గర్లో ఉన్నటువంటి కావిల్లు కట్టుకొని 3 కిలోమీటర్లు నడుచుకుంటూ సెలవులో నీళ్లు తెచ్చుకుంటున్నారు. సెలవులో నీళ్లు తాగడం వల్ల జలుబు. జ్వరాలు వస్తున్నాయి. తక్షణమే విద్యుత్ అధికారులు వాటర్ స్కీం కి విద్యుత్ సరఫరా చేయాలని. కావిల్లు ఖాళీ బిందెలతో ఆందోళన నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాంగి చంద్రయ్య. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## వేగవరంలో అక్రమ అయిల్ దందా

**జంగారెడ్డిగూడెం** జంగారెడ్డిగూడెం మండలం వేగవరం జాతీయ రహదారి పక్కన డీజిల్ ఆయిల్ అక్రమ దందా జోరందుకుంది. ఎవరైనా వెళ్లి ఈ ఆయిల్ వ్యాపారం ఏమిటి అని అడగ్గా విలేకరులకు,అధికారులకు, మామూలు ఇస్తున్నాం అని అంటున్నారని ఆరోపణ వుంది. మాకు లైసెన్స్ ఉంది జిఎస్టి కడుతున్నాం అని ఆయిల్ వ్యాపారం యజమాని అంటున్నాడు. ఈ ఆయిల్ వ్యాపారం చేసుకునేందుకు లైసెన్స్ ఎవరు ఇచ్చారు..?దేనికి ఇచ్చారు..? అస్సలు అక్కడ జరిగేది ఏమిటి అన్న ప్రశ్నలకు సమాధానం లేదు. దీనిపై అధికారులు స్పందించి ఈ అక్రమ ఆయిల్ వ్యాపారానికి ఉన్న లైసెన్స్ ఏంటో దీనికి లైసెన్స్ ఇచ్చారో..? చూసి దానిపైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. .

## ప్రభుత్వ బడులలో పిల్లలను చేర్పించండి

**- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, లక్ష్మీరాజ పిలుపు..**



**బద్వేలు** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్తంగా పిల్లల్ని ప్రభుత్వ బడులలో చేర్పించడం కోసం జరుగుతున్న ప్రచారంలో భాగంగా బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మి రాజా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ట్రెజరర్ నరసింహారావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మీరాజా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి అలాగే మంచి మధ్యాహ్న భోజన పథకం అమలు చేయటం ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థిని మార్కుల యంత్రాలుగా కాకుండా ఆల్ రౌండ్ డెవలప్మెంట్ సాధించటం కోసం ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు.ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు బ్యాగు బెల్టు టై ఏకరూప దుస్తులు గుడ్లు రుచికరమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ఎలాంటి రుసుము చెల్లింపు లేకుండా ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు.అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి పిల్లవానికి అమ్మకు వందనం రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటిలో చదువుతున్న పిల్లలందరికీ అందించటం మరో మంచి అవకాశం కల్పించింది అన్నారు.అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా బడి ఈడు పిల్లలను అందరినీ వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ గా విజ్ఞప్తి చేయుచున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువుల పలువురు విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను తారకరామ నగర్ ఎంపీపీ స్కూల్ నందు 13 మందిని చేర్పించడం జరిగింది.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించడానికి వారి తల్లిదండ్రులు ఎంతో ఉచ్చుకత కనబరిచారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామమూర్తి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు

## ఏసుక్రీస్తు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగును

**సి.బెళగల్** సి.బెళగల్ మండల వ్యాప్తంగా శుక్రవారం చర్చిలలో గుడ్ ఫ్రైడే ఆరాధనలు క్రైస్తవ సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గుడ్ ఫ్రైడే అంటే సమస్త మానవాళి చేసిన పాపాల కోసం ఏసుక్రీస్తు సిలువపై ప్రాణాలు అర్పించిన రోజును గుడ్ ఫ్రైడే అంటారు. గుడ్ ఫ్రైడే రోజు క్రైస్తవులు ఉదయం నుండి ఉపవాసం ఉండి భక్తిశ్రద్ధలతో యేసు క్రీస్తుని ఆరాధిస్తారు. ఈ సందర్భంగా పోలకల్ హోసన్నా మందిరంలో క్రైస్తవ సోదరులను ఉద్దేశించి పాస్టర్ ఏసుదాసు గారు ప్రసంగిస్తూ మన యతిక్రమ క్రియలను బట్టి ఏసుక్రీస్తు గాయపరచబడును, మన దోషమును బట్టి ఆయన నలుగ గొట్టబడెను, సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనము బ్రతికినను ప్రభువు కోసమే బ్రతుకుచున్నాము. చనిపోయినను ప్రభు కోసమే చనిపోవుచున్నాము. కాబట్టి మనము బ్రతికినను, చనిపోయిన ప్రభువారమై ఉన్నా ము అని క్రైస్తవులు ఉపదేశించి ప్రసంగించారు.

## రోడ్డు ప్రమాదంలో పాస్టర్ కుటుంబానికి గాయాలు

**కోదాడ** అనంతగిరి మండలం రాగాపురం గ్రామ శివారులో ఒక లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. బైక్ మీద ప్రయాణిస్తున్న ఐదుగురిలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ద్విచక్ర వాహనంపై పాస్టర్ శ్యాంసుందర్ , భార్య, పాప, ఇద్దరు కొడుకులు ప్రయాణిస్తున్నారు. కోదాడ పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన కుటుంబంగా గుర్తించారు. గుడ్ ఫ్రైడే కావడం తో కోదాడ నుండి దేవుని వాక్యం చెప్పడానికి త్రిపురవరం చర్చ్ కు వెళ్తుండగా ఘటన జరిగింది. గాయపడినవారిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అయ్యాయి

**హైదరాబాద్** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షల ఎకరాల అసైన్డ్ భూములను గడిచిన కొన్ని ఏళ్లలో అడ్రస్ లేకుండా చేసి, అన్యాక్రాంతం చేసారని దక్షిణాది జేఏసీ చైర్మన్ గాలి వినోద్ కుమార్ మండిపడ్డారు. రేపు ఇందిరా పార్కు వద్ద జరిగే హలో అసైన్డ్ చలో ఇందిరా పార్కు మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ తార్నాకలో మీడియా సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వాలు బడా పారిశ్రామికవేత్తల కోసం ల్యాండ్ పూలింగ్ చేసి వారికి స్థలాలను మొత్తం దోచిపెట్టిందన్నారు. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 24 లక్షల 35000 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది అన్నారు. ఐదు లక్షల 35000 ఎకరాల భూములను ధరణి వచ్చాక కూడా ధరనిలో నమోదు చేయలేదని ఆరోపించారు. ఇందిరమ్మ హయాంలో నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉందని దున్నేవాడిదే భూమి అని నినాదంతో పేద ప్రజలకు భూములు పంచిందన్నారు. అలాంటి భూములను మొత్తం ఆక్రమించేసారని అన్నారు

## ప్రజా,శాంతి భద్రతల పరిరక్షణ కోసం జగిత్యాలలో అర్ధరాత్రి పోలీసుల ప్రత్యేక తనిఖీలు



**జగిత్యాల :** శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతకు ప్రధాన ప్రాధాన్యత ఇస్తూ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలమేరకు జగిత్యాల పట్టణంలో పోలీసు అధికారులు గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు . రాత్రి సమయంలో నిఘా మరింత పటిష్టం చేస్తూ సమయానుకూల చర్యలు తీసుకోవడం ద్వారా చాలా వరకు నేరాలను నియంత్రించవచ్చు అని జిల్లా ఎస్పీ ఆలోచన మేరకు జగిత్యాల పట్టణం లోని ప్రదాన కూడలు,బస్ స్టాండ్,చౌరస్తాల్లో, రహదారి పాయింట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత మత్తుపదార్థాలు, ఇతర చట్టవిరుద్ధ వస్తువులను గుర్తించేందుకు శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్ స్క్వాడ్లతో , బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశం:నేరాలు నివారించడం ,నిషేధిత మత్తుపదార్థాల వినియోగం, అక్రమ రవాణా నిరోధించడం,చట్టవిరుద్ధ చర్యలపై పటిష్ట నిఘా పెట్టడం మరియు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచి వారి వివరాలను అడగడం జరిగింది. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 కి సమాచారం అందించాలని సూచించారు.సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.

## వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలపై దాడి

**కోరుట్ల :** వక్ఫ్ అమెండ్మెంట్ బిల్లుతో ముస్లిం మైనార్టీ సమాజంపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దాడులకు తెగబడిందని కోరుట్ల మైనార్టీ నాయకులు ఆరోపించారు.. . వర్ఫ్ బోర్డును నిర్వీర్యపరిచే క్రమంలో భాగంగా పెద్ద ఎత్తున కుట్రలకు కేంద్రం తెరతీసిందని అన్నారు.వక్ఫ్ సవరణ బిల్లును నిరసిస్తూ కోరుట్ల ముస్లిం మైనార్టీలు శుక్రవారం నమాజు అనంతరం అన్ని మసీదులలో ముస్లిం సోదరులు ప్లకార్డులతో,చేతికి నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు ,మత పెద్దలు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలను అణగదొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలు తెచ్చిందని, నల్ల చట్టాలు రద్దయ్యేవరకు అలుపెరుగని పోరాటం చేస్తామని తెలిపారు .ముస్లింలను దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చేందుకు కుట్రలు పన్ను తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే తొంభై శాతం మేర వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయని, మిగిలిన ఆ కొద్ది ఆస్తులను ఆక్రమించుకునేందుకు కేంద్రం కుటిల ప్రయత్నాలు చేస్తుందన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా న్యాయ స్థానాల్లో నిరంతరం పోరాటం చేయడంతో పాటు ముస్లిం మైనార్టీలను నల్ల చట్టాలపై చైతన్య పరుస్తామని మైనార్టీలను ఏకీకృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, వివిధ మసీదుల కమిటీ సభ్యులు,మౌలానాలు, మౌజన్లు, ఇమామ్లు,మత గురువులు,మత పెద్దలు, ముస్లిం యువత తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవింగ్ చేసేవారిక అవగాహన

**- ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్**

**సిద్దిపేట** ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్ సిద్దిపేటలో మాట్లాడుతూ ప్రతి 2.5 గంటలకు వాహనాన్ని ఆపి 5-6 నిమిషాలు నడవడం టీ లేదా కాఫీ తాగడం అవసరం.రహదారి హిప్నాసిస్ అనేది చాలా మంది డ్రైవర్లకు తెలియని శారీరక మరియు మానసిక స్థితి.డ్రైవింగ్ ప్రారంభించిన 2.5 గంటల తర్వాత రహదారి హిప్నాసిస్ ప్రారంభమవుతుంది. హిప్నటైజ్ అయిన డ్రైవర్‌కు కళ్ళు తెరిచి ఉన్నా, మెదడు దృష్టిలోకి వచ్చే దృశ్యాలను రికార్డ్ చేయదు విశ్లేషించదు.

ఈ హిప్నాసిస్ వలన, ముందున్న వాహనాన్ని వెనుక నుండి ఢీకొట్టే ప్రమాదం పెరుగుతుంది ఇది ప్రధానమైన ప్రమాదకరమైన పరిణామం. రహదారి హిప్నాసిస్ ఉన్న డ్రైవర్ ఢీకొన్న క్షణానికి ముందు గడిచిన 15 నిమిషాల్లో ఏమీ గుర్తుపట్టలేడు. అతను తన వాహన వేగం, లేదా ముందున్న వాహనం వేగాన్ని గ్రహించలేడు. ఢీకొట్టే వేగం సాధారణంగా 140 కి.మీ. కంటే ఎక్కువగా ఉంటుంది.దీనిని నివారించాలంటే, ప్రతి 2.5 గంటలకు వాహనాన్ని ఆపి, 5-6 నిమిషాలు నడవడం, టీ లేదా కాఫీ తాగడం అవసరం.డ్రైవింగ్ సమయంలో చుట్టు పక్కల వాహనాలు, ప్రదేశాలు గమనించడం మరియు గుర్తుంచుకోవడం ముఖ్యం.గత 15 నిమిషాల నుంచి ఏమీ గుర్తులేక పోతే, అది ప్రమాద సంకేతం మీరే మృత్యు ప్రాంతంలోకి ప్రవేశిస్తున్నారని అర్థం. రహదారి హిప్నాసిస్ ఎక్కువగా రాత్రిపూట జరుగుతుంది. ప్రయాణీకులు నిద్రలో ఉండగా, డ్రైవర్‌కు నిద్ర వత్తిడి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల డ్రైవర్ తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోవాలి. కళ్లు తెరిచినా, మనసు మూసుకుపోతే ప్రమాదాలు తప్పవు.కాబట్టి సురక్షితంగా ఉండండి. సురక్షితంగా డ్రైవ్ చెయ్యండి ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్ తెలిపారు.

## బాధినేహాల్ తమ్మి రెడ్డి వారి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు

**- మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
**- బాధినేహాల్ నాయకులు లక్ష్మిరెడ్డి**

**కౌతాళం** రావు సాహెబ్ బదినేహళ్ తమ్మిరెడ్డి వారి సత్రం కమిటీ సౌజన్యంతో మండల గ్రామ ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆసక్తి గలవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వైసిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి మరియు బదినేహళ్ పద్మావతమ్మ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఆదోనిలో రావు సాహెబ్ బాధినేహాల్ తమ్మిరెడ్డి వారి సత్రం భవనం పెద్ద పోస్ట్ ఆఫీస్ ముందు ఉచిత కంటి పరీక్షలు ఆపరేషన్ మరియు గుండె,కిడ్నీ వైద్య పరీక్షలు ఏప్రిల్ 30వ తేదీన ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ఆధార్ కార్డు. ఆరోగ్యశ్రీ కార్డు, తెల్ల రేషన్ కార్డు,రెండు పాస్పోర్ట్ ఫోటోలు,మరియు వారి దగ్గర ఉన్న సెల్ ఫోన్ నెంబర్ కాంటాక్ట్ నెంబర్ ఏప్రిల్ 28,,29 లోపల నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో ఉచిత కిడ్నీ వైద్య పరీక్షలు బీపీ,షుగర్, సిబిపి, సి యు సి,ఉచితంగా గుండె పరీక్షలు ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ, టుడి ఎకో,టిఎంటి, గల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

అలాగే వైద్య నిపుణులచే ఉచితంగా కంటి పరీక్షలు చేయబడును కంటి ఆపరేషన్లు అవసరమైనచో వారికి అత్యాధునికమైన లెన్స్ కూడా ఉచితంగా అమర్చబడును శిబిరంలో కంటి ఆపరేషన్ అవసరమైన వారికి అదే రోజు నంద్యాలలో తీసుకెళ్లి శాంతిరం హాస్పిటల్ నందు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయబడును ఆ ప్రశ్న కొరకు వెళ్లిన వారికి నంద్యాలలో భోజనము వసతి ఇతర సౌకర్యములు ఉచితంగా కల్పించబడును. అని పేర్కొన్నారు..

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించిన సిద్దిపేట ట్రాఫిక్ పోలీసులు



**సిద్దిపేట** పాత బస్టాండ్ వద్ద అందాజ 60 సంవత్సరాలు పైబడిన దుద్దెడ గ్రామానికి చెందిన వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా ఒక ద్విచక్ర వాహనదారుడు టక్కరు ఇవ్వగా అతను సొమ్మసిల్లి రోడ్డు పైన పడిపోగా వెంటనే అక్కడ ట్రాఫిక్ డ్యూటీ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు రాజేష్, కమలాకర్ వెంటనే మోటార్ సైకిల్ అతనిని పట్టుకొని వెంట అంబులెన్స్ కు ఫోన్ చేసి 108 అంబులెన్స్ కు ఫోన్ చేసి అంబులెన్స్ లో గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి మోటార్ సైకిల్ నడిపిన వ్యక్తిని సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు అప్పగించడం జరిగింది.రోడ్డు ప్రమాదం జరిగి పడిపోయిన వ్యక్తిని గమనించి మానవత్వాన్ని చాటి ఇరువురు కానిస్టేబుళ్లు వెంటనే అతని వద్దకు వెళ్లి పైకి లేపి నీళ్లు తాగిపించి 108 అంబులెన్స్ కి ఫోన్ చేసి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి వారి బంధువులకు సమాచారం అందించారు. ఇరువురు కానిస్టేబుల్ చేసిన సేవలను గుర్తించిన ప్రజలు అభినందించారు.

## కౌతాళంలో కమెల వేలం పాట రద్దు చేయండి



**కౌతాళం** కౌతాళం పంచాయతీలో ఇటీవల నిర్వహించిన కమేలా వేలం పాటను రద్దు చేయాలని ఖురైసి కమ్యూనిటీ సిబ్బంది కోరారు. గురువారం డి ఎల్ పి ఓ నూర్జహాన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కటిక వృత్తి కార్మికులు వాసిమ్, ఖాసీం వలీ, మహబూబ్, ఇబ్రహీం, గౌస్ మోద్దీన్, జాంగీర్ షబ్బీర్ ఖాదర్ బాష మాట్లాడుతూ పెద్దకడబూరు, మంత్రాలయం, కోసిగి మండలాల్లో లేని నిబంధన కౌతాళం లో ఉండడంపై తమ బాధలను వ్యక్తం చేశారు. చికెన్ అంగడిల పై రుసుం నిబంధన అమలు చేయడంతో నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు.
పంచాయతీ తరపున కమేలాకు స్థలం కేటాయించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. సంబంధిత అధికారులు తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

## ఈవో బంగ్లాలోకి నాగుపాము పట్టుకోబోతే కాటు



**తిరుమల :** టీటీడీ గోశాల వివాదం వేళ ఈవో బంగ్లాలోకి నాగుపాము పట్టుకోబోతే కాటు
టీటీడీ గోశాల వివాదం నేపథ్యంలో ఒక్కసారిగా సంచలనం రేపే ఘటన చోటుచేసుకుంది. టీటీడీ ఈవో శ్యామలారావు నివసిస్తున్న బంగ్లాలోకి ఓ నాగుపాము ప్రవేశించింది. పామును పట్టుకొని గోనె సంచిలో వేసే క్రమంలో టీటీడీ రిటైర్డ్ ఉద్యోగి ఒకరిని కాటేసింది. ఈ ఘటన ఇప్పుడు భక్తుల్లో కలకలం రేపుతోంది. ప్రస్తుతం జరుగుతున్న గోశాళ వివాదం నేపథ్యంలో నాగుపాము బంగ్లాలోకి రావడం, కాటేయడంపై భక్తులు రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

## బేగంపేటలో శ్రీపాద స్మారక బస్ షెల్టర్ ఘనంగా భూమి పూజ



**కమాన్ పూర్** రామగిరి మండలం బేగంపేటలోని ప్రధాన చౌరస్తాలో మాజీ శాసనసభాపతి దివంగత స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు స్మారక బస్సు షెల్టర్ కు శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు దాసరి శివ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కట్టడాలను కూల్చివేసి గ్రామ ప్రజలకు నిలువ నీడ లేకుండా చేశారనీ అయితే పడగొడితే నిలబెడతామని కూల్చేస్తే పునర్నిర్మిస్తామన్నారు.ఇప్పటికే గ్రామంలో వాడవాడలా మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కొన్ని రోజుల క్రితం బస్టాండ్ స్థలంలోనే మంత్రి శ్రీధర్ బాబు నూతన బోరు వేయించారని దాసరి శివ గుర్తు చేశారు.కార్యక్రమంలో బేగంపేట టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కల్వల శంకర్ రామగిరి మండల నాయకులు బర్ల శ్రీనివాస్ ముస్త్యాల శ్రీనివాస్ కాటం సత్యం అవినాష్ గౌడ్ అనవేన రాయమల్లు మాతంగి కుమార్ బొంతల రవి జట్టవేన రంజిత్ శ్రీమంతుల లచ్చులు దుర్గి కొమురయ్య బాణాల వీరాచారి గోవిందుల రాజీరు ఎస్ కె కాజా పాషా గూడెల్లి సురేష్ ఏట రమేష్ ఇల్లందుల సంజీవ్ ఊదరి రవీందర్ సుద్దాల సంపత్ సిరిపురం శ్రీనివాస్ ఊదరి రమేష్ బొంతల రమేష్ చొప్పరి సంజీవ్ తాళ్లపల్లి రాజు గౌడ్ ఊదరి రమేష్ కెక్కర్ల సతీష్ ఊదరి కిషన్ గుర్రాల రాయమల్లు కుంట శంకర్ రేగళ్ల రాజేశం అంకతి కుమార్ గుండా శ్రీనివాస్ ఇల్లందుల బాపు పేరం రాజేశం సుద్దాల రాజేష్ గుడిసెల సందీప్ ఊదరి రవి గుండా కుమార్ ఇల్లందుల సతీష్ రావికంటి రాజన్న కైలాస కేదారి కోరకొప్పుల కాశినాదం కందుకూరి నవీన్ రామగిరి రామకృష్ణ సింగరవేణ మల్లయ్య తాళ్లపల్లి అంజయ్య గోగుల శంకర్ మహేష్ మహిళా నేతలు కెక్కేర్ల స్వరూప గుర్రాల శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మా కళాశాలకు రండి

**- నాణ్యమైన విద్యా మంచి బోధనే**

**అందిస్తామన్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్**



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో గల ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రిన్సిపాల్ టి శ్రీనాథ్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోని పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినీ విద్యార్థులను వారి తల్లిదండ్రులను కలిసి కళాశాలలో నాణ్యమైన విద్యా నమ్మకమైన బోధన ఉంటుందని కళాశాలకు హాజరుకాని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రతిరోజు ఫోన్ చేయడం ఫోన్ లిఫ్ట్ చేయని యెడల వారి ఇంటికి వెళ్లి వారికి తగినటువంటి కౌన్సిలింగ్ చేయడం చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి స్టడీ మెటీరియల్ అందజేయడం సంవత్సరానికి రెండు సార్లు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడం జరుగుతుంది. ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మా కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలని వివరించడం జరుగుతుంది.

# ప్రాథమిక పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**- అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు**

వేములవాడ, (ప్రశ్న న్యూస్) వేములవాడ రూరల్ మండలంలోని నమిలిగుండుపల్లి (కొత్తపల్లి) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం రాత్రి ఘనంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మండల విద్యాధికారి కిషన్, ఎంపీడీఓ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతి విద్యార్థి తన ప్రతిభను ప్రదర్శించే అవకాశం అందుకున్నందుకు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీరామోజు శ్రీనివాస్ మాట్లాడుతూ, "విద్యార్థుల సమగ్ర అభివృద్ధే మా లక్ష్యమని, పాఠశాల వార్షికోత్సవం తరహాలో ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడంలో సహాయపడతాయని, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అందరూ





కలిసి భాగస్వామ్యంగా సహకరించడంతో ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అంజలి, మాజీ సర్పంచులు మల్లేశం, లక్ష్మి-లక్ష్మణ్, మాజీ ఎస్ఎంసి చైర్మన్ మల్లేశం, నరేశ్, గ్రామ ప్రముఖులు మహేష్, జితేందర్, వంశీ, ఆర్మడ్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ ప్రణీత్, కానిస్టేబుళ్లు రాజు, అనిల్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు తదితర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు ట్రావలింగ్ చార్జీలు ఇవ్వాలి.

**నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి పనిచేసిన గిట్టుబాటు గాని కూలి.**

**జిల్లా కార్యదర్శి బూడిది గణేష్.**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండలం మైదుపల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి అడవి ప్రాంతంలో ఉపాధి హామీ పనులు చేస్తున్నారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుపల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు ఎర్రటి ఎండలో నాలుగు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి అడవి ప్రాంతంలో ఉపాధి పనులు చేస్తున్నారని వీరికి ట్రావెలింగ్ చార్జీలు ఇవ్వటం లేదని విమర్శించారు ఇంత దూరం వచ్చి పనిచేసిన కూలి గిట్టుబాటు కావడం లేదని అన్నారు పనిముట్లైన పార గడ్డపార తట్టలు కూలీలే కొనుకుంటున్నారని ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని విమర్శించారు నాలుగు కిలోమీటర్లు పోయి వచ్చే క్రమంలో ప్రమాదాలు జరుగుచున్న అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు పని ప్రదేశంలో కలిసే సౌకర్యాలు లేవని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఉపాధి కూలీలకు ట్రావెలింగ్ చార్జీలు ఇచ్చి రెండు నెలల కూలీల డబ్బులు విడుదల చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల నాలుగు నెలల వేతనాలు ఇవ్వాలని పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు తూండ్ల కనకయ్య తమ్మిశెట్టి మల్లయ్య ఇసంపల్లి శ్రీనివాస్ పంతంగి లక్ష్మి పెట్టం పుష్ప తదితరులు పాల్గొన్నారు

# సేవా పురస్కారాలతో మధు మహేష్-కవిత దంపతులకు ఘనత

**- ఉపాధ్యాయ వృత్తి, సామాజిక సేవలో మధు మహేష్ - మధు కవిత దంపతులు**

వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణానికి చెందిన డాక్టర్ మధు మహేష్ విద్యారంగం, సామాజిక సేవల పటిష్ట బాటలో నడుస్తూ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తున్న డాక్టర్ మధు మహేష్ - మధు కవిత దంపతులకు రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయి. ఈ విశేష పురస్కారాలు వారి నిస్వార్ధ సేవలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**డాక్టర్ మధు మహేష్‌కు "రాష్ట్రీయ సేవా పురస్కార్ నేషనల్ అవార్డు"**

ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో సేవలందిస్తూ, అదే సమయంలో "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్" ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మధు మహేష్ ను "ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ" ప్రశంసిస్తూ "రాష్ట్రీయ సేవా పురస్కార్ - నేషనల్ అవార్డు"తో సత్కరించింది. ఆయన విద్యా వ్యాప్తిలో చేసిన కృషి, సేవా కార్యకలాపాల్లో చూపిన నిబద్ధత ప్రశంసనీయం.

**మధు కవితకు 'భారతీయ నారీశక్తి ఇంటర్నేషనల్ అవార్డు'**

ఇక మధు కవిత "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్"లో కీలక





పాత్ర పోషిస్తూ, మహిళా శక్తి, బాలికల విద్య, ఆరోగ్య చైతన్యం, స్వయం సహాయక బృందాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఈ త్యాగభరితమైన సేవలకు గుర్తింపుగా "స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా" ఆమెకు "భారతీయ నారీశక్తి ఇంటర్నేషనల్ అవార్డు"ను ప్రకటించింది. సమాజానికి సందేశమిచ్చిన దంపతులు ఈ పురస్కారాలు కేవలం ఒక గౌరవం మాత్రమే కాదు, సేవాభావం ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రేరణగా నిలుస్తాయని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యావేత్తలుమధు మహేష్-కవిత దంపతులను అభినందించారు. మధు మహేష్ మాట్లాడుతూ "సేవ అనేది ఒక్క రంగానికే పరిమితం కాదు. విద్య ద్వారా సమాజాన్ని మారుస్తూనే, సామాజికంగా ఉపయోగపడే పనుల్లో భాగస్వాములమవడం నా కర్తవ్యం" అని తెలిపారు. మధు కవిత మాట్లాడుతూ మహిళలు ఎదగాలి అంటే వారికి అండగా ఉండాలి. నేను చేస్తున్నది ఒక తక్కువ ప్రయత్నం మాత్రమే. ఈ గౌరవం నాకు కాదు, నాకు తోడుగా ఉన్న ప్రతి మహిళా సభ్యురాలికి చెందింది" అని వెల్లడించారు. ఈ అవార్డులు వారి బాధ్యతను మరింత పెంచాయని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని ప్రజా ప్రయోగ కార్యక్రమాలు నిర్వహించేందుకు తమ కార్యాచరణ కొనసాగుతుందన్నారు. వీరి సేవా ప్రయాణం సామాజిక మార్పుకు ప్రతీకగా నిలిచిందని, యువత వీరి బాటలో నడవాలని పలువురుప్రముఖులు పిలుపునిచ్చారు.

# విధి వక్రించిన కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన కాంగ్రెస్ పార్టీ



ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం హొనాజీపేట్ గ్రామం లో ఇటీవల విషపు నీరు తాగి గోర్లు మరణించడం జరిగింది. వారికి జరిగిన నష్టం లో పాలు పంచుకోవాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి సహాయం చేయాలని 22000 రూపాయలు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్ ఆధ్వర్యంలో తల ఇంత అని జమ చేసి అందించడం జరిగింది. దాంట్లో పాలుపంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆర్మూర్ చిన్న బాల్ రాజ్ 5000, జనార్ధన్ రెడ్డి 4000, రవి 2000, సుభాష్ రెడ్డి 2000, అన్సాన్పల్లి సంతోష్ 2000, మంగీత్య నాయక్ 1000, సి హెచ్ శ్రీనివాస్ 1000, సుదర్శన్, జానీ 1000 , రమేష్ నాయక్ 1000, మురళి 1000, డాక్టోర్ రాజేందర్ 2000 మొత్తం కలిసి 22000 వేయిల రూపాయలు అందజేయడం జరిగింది.

# రాజన్నను దర్శించుకున్న సినీ ప్రముఖులు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) దక్షిణ కాశీగా పేరు గాంచిన, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని శుక్రవారం సినీ పరిశ్రమకు చెందిన సంపత్ నంది, అశోక్ తేజ దర్శకులు, డి. మధు ప్రొడ్యూసర్, వశిష్ట సింహ హీరో (ఓదెల-2 మూవీ)తో కలిసి రాజన్నను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి, స్వామివారి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆలయ పర్యవేక్షకులు వరి నర్సయ్య, శ్రీకాంత్ ఆచార్యులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

# బైబిల్ మిషన్ చర్చ లో భక్తిశ్రద్ధలతో గుడ్ 'ఫ్రైడే

**- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు**

**- భక్తిగీతాలతో ఏసుక్రీస్తు ఆరాధన**

నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్ )జగతికి శాంతి సందేశానిస్తూ క్రీస్తు శిలువనెక్కిన రోజైన గుడ్‌ఫ్రైడే సందర్భంగా నాయుడుపేట పట్టణంలోని మేనకూరు వద్ద ఉన్న బైబిల్ మిషన్ చర్చ లో భక్తిశ్రద్ధలతో గుడ్ 'ఫ్రైడేఘనంగా నిర్వహించారు. పాస్టర్ దార సాల్మన్ రాజ్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు శిలువ ఊరేగించిన అనంతరం మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రార్థనలు జరిగాయి. ప్రత్యేక ప్రార్థనల మధ్య భక్తులు గురువుల ఆశీర్వాదాలు పొందారు. చర్చిల్లో పాస్టర్ దార సాల్మన్ రాజ్ భక్తులకు దైవసందేశం చేశారు. అనంతరం ఏసయ్య భక్తి గీతాలు ఆలపించారు. చర్చిల్లో బైబిల్ మిషన్ చర్చ లో జనాలు భారీగా తరలిరావడంతో చర్చి ప్రాంతం కిటకిటలాడింది. ఈ భక్తుల





సౌకర్యార్థం చర్చి ప్రాంగణంలో టెంట్లు, శామియానాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అలెగ్జాండర్ , మాదిరమ్మ, అక్షయ్ ,భాగ్యరాజ్, అన్నపూర్ణమ్మ, జనిత్ మహారాజ్, ధనుష్ ,ప్రజలు , తదితరులు పాల్గొన్నారు.

# సామంచి శుభలక్ష్మమ్మకు నివాళులర్పించిన పేట బిజెపి నేతలు



నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్) తిరుపతి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు మాతృమూర్తి శుభలక్ష్మమ్మ కు నాయుడుపేట పట్టణానికి చెందిన బిజెపి నేతలు ఘన నివాళులర్పించారు. సామంచి శుభ లక్ష్మమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న బిజెపి ఎస్సీ మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి బొల్లకాయల విజయభాస్కర్, బిజెపి తిరుపతి జిల్లా మాజీ కార్యదర్శి ఆశా చెంచు కృష్ణయ్య, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కొపోల్లు సుబ్రహ్మణ్యం లు శుక్రవారం తిరుపతి లోని సామంచి శ్రీనివాసులు నివాసానికి చేరుకొని శుభలక్ష్మమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సామాజి శ్రీనివాసులు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు : పూనెం శ్రీనివాస్

**అసలు వారసులు ఎవరనన్నది అందరికి తెలుసు**

**మా భూమి జోలికి వస్తే సహించేది లేదు**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు గ్రామపంచాయతీ పరిధిలోని మోకాళ్ళ గుంపు వద్ద ఉన్న తమ భూమిపై కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, ఇంటిపేరును అడ్డం పెట్టుకుని నేనే వారసుడినంటూ నమ్మిస్తు పడిగ ప్రశాంత్ చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తు పడిగ పాపయ్య వారసురాలైన పడిగ పద్మ అలియాస్ తాటి పద్మతో కలిసి పూనెం శ్రీనివాస్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 సంవత్సరంలో పడిగ పాపయ్య కి చెందిన 1.30 ఎకరాలు సర్వే నెంబర్. 17/56/ అ. 17/56/అ భూమిని గలిగా బాబురావుకు విక్రయించగా, 2013లో నీలం రామయ్య కొనుగోలు చేశారని, 2018లో తాము కొనుగోలు చేసినట్టు తెలిపారు. పడిగ ఇంటి పేరు చెప్పి తానే వారసుడినని చెప్పుకుంటే సరిపోదని ఎలాంటి లేకుండా పడిగా ప్రశాంత్ ఏ విధంగా వారసుడు అవుతాడొ చెప్పాలన్నారు. పడిగ పాపయ్యకు ఐదుగురు సంతానం కాగా పద్మ మాత్రమే జీవించి ఉన్నారని, కానీ పడిగ ప్రశాంత్, ఎలకం రామకృష్ణ కావాలని తనపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఇదంతా చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లు లోతువాగు సర్పంచ్ గా ఉన్న పడిగ ప్రశాంత్ ఏ రోజు కూడ ఈ భూమి విషయంలో సహకరించకపోగా నేడు ఇలా నేడు ఇలా చేయడం దారుణమన్నారు. తన తండ్రి పడిగ పాపయ్య భూమిని వేరే వాళ్లకు అమ్మడం జరిగిందని పడిగా పాపయ్యకు తామే వారసులమన్న పడిగ పద్మ అలియాస్ తాటి పద్మ పడిగా ప్రశాంత్ కి ఈ భూమికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అసలు ఈ భూమికి పడిగా ప్రశాంత్ ఎటువంటి సంబంధం లేదని కావాలనే ఈ భూమి విషయంలో గొడవ చేస్తూ ఇబ్బందులను పెడుతున్నాడని, వారి పేరు మీద ఉన్న భూములను అమ్ముకున్న ప్రశాంత్ ఈ భూమి విషయంలో వివాదాలు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని. ఇప్పటికే ఈ భూమి వివాదంలో పోలీస్ స్టేషనులకు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.




# ఓటీటీలోకి 'ఎల్ 2: ఎంపురాన్'..

## – స్ట్రీమింగ్ ఎప్పుడంటే.!

మలయాళం నుంచి వచ్చి బాక్సాఫీస్ వద్ద రికార్డులు సాధించిన మోహన్ లాల్ 'ఎల్ 2: ఎంపురాన్' మూవీ ఓటీటీలో అలరించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాలో మలయాళీ సూపర్ స్టార్, నటుడు మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటించగా.. మలయాళ నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. మంజు వారియర్ టోవినో థామస్ కీలక పాత్రల్లో నటించారు. మార్చి 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఒకవైపు పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతునే మరోవైపు వివాదాల్లో చిక్కుకుంది. రీసెంట్‌గా ఈ చిత్రం రూ.250 కోట్లకు పైగా వసూళ్లను కూడా రాబట్టింది. అయితే ఈ చిత్రం తాజాగా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది.ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో ఈ నెల 24 నుంచి తెలుగు, మలయాళం, కన్నడ, తమిళ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.



## ఉత్తరాఖండ్‌లో నా పేరుతో గుడి ఉంది : ఊర్వశీ రౌతేలా

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా మరోసారి తన వ్యాఖ్యలతో ఆన్‌లైన్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల 'డాకు మహారాజ్' సినిమాతో నవ్వులపాలైన ఈ నటి, ఇప్పుడు నమ్మశక్యం కాని మరో వాదనను తెరపైకి తెచ్చింది. సన్నీ డియోల్, రణదీప్ హుడా నటించిన 'జాట్' సినిమాలో ఒక ఐటమ్ సాంగ్ చేసిన ఊర్వశి, తాజాగా తన పేరుతో ఉత్తరాఖండ్‌లో ఒక గుడి ఉందని, ఇప్పుడు దక్షిణ భారతదేశంలో కూడా తన పేరుతో ఒక గుడిని నిర్మించాలని కోరుకుంటున్నట్లు చెప్పింది. ఉత్తరాఖండ్‌లో నా పేరుతో టెంపుల్ ఉంది. మీరు బద్రీనాథ్ టెంపుల్‌కి వెళ్లినప్పుడు, సరిగ్గా దాని పక్కనే అది మీకు కనిపిస్తుంది. ప్రజలు ఆ గుడిలో ప్రార్థనలు చేస్తారని, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు కూడా తనను ప్రార్థిస్తారని అలాగే తన ఫోటోలకు పూలమాలలు వేసి 'దండమమాయి' అని కోలుస్తారని ఊర్వశి చెప్పింది. నా కోరిక ఏమిటంటే.. గత ఒకటిన్నర సంవత్సరాల వ్యవధిలో మెగాస్టార్ చిరంజీవితో పాటు పవన్ కళ్యాణ్, బాలకృష్ణలతో కలిసి నటించాను. వారికి దక్షిణాదిలో గుళ్లు ఉన్నట్లే.. నా అభిమానుల కోసం కూడా దక్షిణ భారతంలో గుడి ఉండాలని నా కోరిక అని ఊర్వశి చెప్పుకోచ్చింది.

# ఇది నాకు కఠినమైన సమయం

గత ఏడాది 'సూక్ష్మదర్శిని' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించారు మలయాళ నటి నజ్రియా. రీసెంట్‌గా ప్రకటించిన కేరళ రాష్ట్ర ప్రభుత్వ చలనచిత్ర అవార్డులలో ఆ సినిమాకు గాను ఉత్తమనటిగా అవార్డును కూడా గెలుచుకున్నారామె. 'సూక్ష్మదర్శని' తర్వాత నజ్రియా సినిమాలకూ, మీడియాకూ, చివరకు ఫోన్‌కి కూడా దూరంగా ఉన్నారు. దీంతో ఆమెపై మీడియాలో రకరకాల కామెంట్లు వస్తున్నాయి. తన భర్త ఫహాద్ ఫాజిల్‌తో ఆమె విడిపోయారంటూ కథనాలు కూడా వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో రీసెంట్‌గా నజ్రియా ఒక ఎమోషనల్ పోస్ట్‌ని తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'వ్యక్తిగత కారణాలవల్ల కొంతకాలంగా అందరికీ దూరంగా ఉంటున్నా. నా గురించి తెలుసుకోవడం కోసం ప్రయత్నించిన అందరికీ ధన్యవాదాలు. వాళ్ల ఫోన్లు కూడా నేను లిఫ్ట్ చేయలేదు. చాలామంది నిర్మాతలు నా డేట్స్ కోసం ట్రై చేశారు. నేను స్పందించలేదు. వారందరినీ క్షమించమని వేడుకుంటున్నా. ఇదినాకు కఠినమైన సమయం. నా 30వ పుట్టినరోజు, న్యూ ఇయర్ వేడుకలు, చివరకు నా సినిమా సక్సెస్‌మీట్స్‌కి కూడా దూరంగా ఉన్నా. దానికి బలమైన కారణమే ఉంది. త్వరలోనే కోలుకుని మీ ముందుకు వస్తా.' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు నజ్రియా. ఈ పోస్ట్ చివర్లో తన పేరును 'నజ్రియా నజీం ఫహాద్' అని రాయడంతో ఫహాద్‌తో తాను విడిపోతున్నదని వస్తున్న వార్తలన్నింటికీ చెక్ పడినట్టయ్యింది.



# 'ఓదెల-2' అంచనాలను నిజం చేసింది

'ఈ సినిమాపై మేము పెట్టుకున్న అంచనాలన్నీ నిజమయ్యాయి. నాగసాధువుగా తమన్నా ? పర్‌ఫార్మెన్స్ హైలైట్‌గా నిలుస్తుందని ముందే చెప్పాను. ఈ రోజు ఆడియన్స్ కూడా అదే మాట అంటున్నారు. శుక్రవారం నుంచి ఈ సినిమా సునామీ మొదలుకాబోతున్నది. శివశక్తిగా తమన్నా చేసే రచ్చ అప్పుడే ఆరంభమవుతుంది' అన్నారు అగ్ర దర్శకుడు సంపత్‌నంది. ఆయన క్రియేటర్‌గా వ్యవహరించగా తమన్నా ప్రధాన పాత్రలో నటించిన 'ఓదెల–2' గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. డి.మధు నిర్మించిన ఈ చిత్రానికి అశోక్‌తేజ దర్శకుడు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు.ఈ సందర్భంగా సంపత్‌నంది మాట్లాడుతూ.. ట్లైమాక్స్‌లో వచ్చే ఎపిసోడ్స్ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయని, ఫ్యామిలీ అంతా కలిసి చూడాల్సిన సినిమా ఇదని అన్నారు. థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి ఈ సినిమా చూశానని, మహిళలకు ఈ సినిమా బాగా కనెక్ట్ అయ్యిందని, ఆధ్యాత్మికత మూర్తీభవించిన నాగసాధువుగా తమన్నా పాత్ర ప్రతి ఒక్కరిని మెస్మరైజ్ చేస్తున్నదని నిర్మాత డి.మధు ఆనందం వ్యక్తం చేశారు. తన కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుందని నటుడు వశిష్ట ఎన్ సింహ తెలిపారు.




# బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి

దీక్షిత్‌శెట్టి హీరోగా నటిస్తున్న చిత్రం 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి'. తెలుగు, కన్నడ భాషల్లో క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. అభిషేక్ ఎమ్ దర్శకుడు. బృందా ఆచార్య కథానాయికగా నటిస్తున్నది. హెచ్ కె ప్రకాష్ నిర్మాత. గురువారం ఈ సినిమాలోని 'హర ఓం..' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేశారు. జుదాన్ శ్యాండీ స్వరపరచిన ఈ పాటను మంగ్లీ ఆలపించారు. బతుకుపై ఆశను తెలియజేస్తూ ఆధ్యాత్మిక భావాలతో ఈ పాట సాగింది. 'ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. వినూత్నమైన కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న కామెడీ థ్రిల్లర్ ఇది. కథలోని మలుపులు ఆకట్టుకుంటాయి' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జుధాన్ శ్యాండీ, రచన–దర్శకత్వం: అభిషేక్ ఎమ్.



# మధురమైన టీనేజ్ ప్రేమకథ



'12ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్‌గా వర్క్‌చేశా. చాలా సినిమాల్లో బ్యాక్‌గ్రౌండ్ ఆర్టిస్టుగా నటించా. ఇన్నాళ్లకు 'మధురం' చిత్రంతో హీరోగా మారా.' అంటున్నారు యువ నటుడు ఉదయ్‌రాజ్. ఆయన హీరోగా పరిచయమవుతున్న టీనేజ్ లవ్‌స్టోరీ 'మధురం'. 'ఎ మెమొరబుల్ లవ్' అనేది ఉపశీర్షిక. వైష్ణవిసింగ్ కథానాయిక. రాజేష్ చికిలే దర్శకుడు. ఎం బంగార్రాజు నిర్మాత. శుక్రవారం సినిమా విడుదలవుతోంది.ఈ సందర్భంగా ఉదయ్‌రాజ్ మీడియాతో ముచ్చటించారు. 'దర్శకుడు రాజేష్ చికిలేతో నాకెప్పట్నుంచో పరిచయం. ఈ కథ చెప్పినప్పుడు చాలా ఎక్సయిట్ అయ్యా. 90ల్లో జరిగే కథ ఇది. 10వ తరగతి అమ్మాయి మధు, 9వ తరగతి అబ్బాయి రామ్‌ల మధ్య నడిచే ప్రేమకథ. ఇందులో చిన్నపిల్లాడిగా, స్కూల్ స్టూడెంట్‌గా, మిడిల్ ఏజ్ వ్యక్తిగా మూడు డిఫరెంట్ వేరియేషన్స్‌లో కనిపిస్తా. ఎంతో కష్టపడి ఈ పాత్ర చేశా. ఫుడ్ తినడం మానేసి కొన్ని రోజులు నీళ్లు మాత్రమే తాగేవాడ్ని. నేను చదువుకుంది జెడ్‌పీహెచ్ స్కూల్‌లోనే. అప్పటి రోజుల్ని గుర్తు చేసేలా దర్శకుడు ఈ సినిమా తెరకెక్కించారు.' అని తెలిపారు. కథానాయిక వైష్ణవిసింగ్ చక్కగా నటించిందని, నటుడిగా కొనసాగడం తనకు ముఖ్యమని, కేవలం హీరోగానే కాకుండా, ఎలాంటి పాత్రనైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని, తామంతా కొత్తవాళ్లమైనా ధైర్యం చేసి బంగార్రాజు చిత్రాన్ని నిర్మించారని, వి.వి.వినాయక్, విశ్వక్‌సేన్ లాంటి సినీ ప్రముఖులు ప్రమోషన్ విషయంలో సహకరించారని ఉదయ్‌రాజ్ తెలిపారు.

## ఆపదలో ఆపద్బాంధవులురాలు తాజా మాజీ సర్పంచ్ గోదావరి వెంకటరాములు



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపురం గ్రామానికి చెందిన వడ్డీ హుస్సేన్ పెళ్లి సందర్భంగా స్వయంగా పెళ్లి కుమారుడు ఇంటికి వెళ్లి 5000 రూపాయలు నగదు మరియు 30 కిలోల బియ్యం, మరియు పెళ్లి బట్టలు దాత అయినటువంటి మాల సుధాకర్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తామని కిష్టాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ తిరునగరి గోదావరి వెంకటరములు తెలిపారు, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం మరియు బియ్యం, పెళ్లి బట్టలను అందజేసిన గోదావరి మరియు మాల సుధాకర్ కు ఎల్లవేళలా వారి కుటుంబ సభ్యులకు తోడు ఉంటామని వడ్డే హుస్సేన్ కుటుంబ సభ్యులు తెలిపారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నాగుల గారి సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షులు వరిగుంతం నాగరాజు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ సోషల్ మీడియా ఇన్చార్జ్ మల్కె నరేందర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రె నారాయణ, అక్కే శేఖర్ యాదవ్, మాల వెంకట్, పసుల పురుషోత్తం, పసుల రంగయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వానికి ప్రేమతత్వం బోధించిన
# దయామయుడు...ఏసుక్రీస్తు

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి : కట్ట లచ్చయ్య**



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలంలోని తడగొండ గ్రామానికి చెందిన,కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కట్ట లచ్చయ్య శుక్రవారం జిల్లా ప్రజలందరికీ “గుడ్ ఫ్రైడే” శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి ప్రేమతత్వం బోధించిన దయామయుడు,సిలువపై ఏసుక్రీస్తు త్యాగం మహోన్నతమైందని,కరుణామయుడి జీవితం మానవాళికి అందించిన గొప్ప సందేశమని, ప్రభు యేసు త్యాగాన్ని స్మరిస్తూ క్రైస్తవ సోదర, సోదరీమణులకు ఆధ్యాత్మిక శాంతి కలుగాలని ఆకాంక్షిస్తూ కట్ట లచ్చయ్య “గుడ్ ఫ్రైడే” శుభాకాంక్షలు తెలియజేశారు.

## కెసిఆర్ సభకు భారీగా తరలి రావాలి
# గోడపత్రికను ఆవిష్కరించిన

**యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని పైతర గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించారు ఈ సందర్భంగా రవితేజ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 27 నా వరంగల్ లోనిర్విస్తున్నటువంటి రచతోత్సవ వేడుకలకు మెదక్ జిల్లా నుండి భారీగా కార్యకర్తలు మరియు యువజన నాయకులు తరలివెల్లి సభను విజయవంతం చేయవలసిందిగా మెదక్ జిల్లా యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో పైతర గ్రామ మాజీ తాజా సర్పంచ్ ఎల్లేశం, మాజీ ఎంపీటీసీ ఆదామ్, మాజీ సర్పంచ్ మురళి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మల్లేశం, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆంజనేయులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

# అంబేద్కర్ విగ్రహానికి రక్షణ కల్పించాలి

**ఇరువర్గాలను కూర్చోపెట్టి సమస్య సర్దుమణిగించాలి.**

**కేవీపీస్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కడారి నాగరాజు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతిరోజు ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం తొలగించాలనే ఉదేశ్యంతో గ్రామంలో ఒకవర్గానికి చెందిన వారు అంబేద్కర్ విగ్రమం ముందు జెండా పాతడం జరిగిందని కేవీపీస్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కడారి నాగరాజు అన్నారు. ప్రపంచ మేధావులలో అంబేద్కర్ ఒకరని అతని విగ్రహాలు ప్రపంచ వ్యాప్తంగా నిర్మిస్తుంటుంటే దేశంలో, రాష్టంలో అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు, రక్షణ శాఖ విఫలం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు అంబేద్కర్ జయంతులు వస్తే అందరూ నాయకులు వచ్చి ప్రగల్బాలు పలికిన అంబేద్కర్ ఆశయాలు నెరవేర్చడంలో ఏ ఒక నాయకుడు ముందుకు రావట్లేదాను. మెదక్ జిల్లాలో అంబేద్కర్ విగ్రహంలు నిర్మించడం కంటే ఉన్న విగ్రహాలను ఎలా తొలగించాలనే అధికారులు చూస్తున్నారు తప్ప మరొకటి కనిపించడం లేదన్నారు. ఈ మధ్యకాలంలో జిల్లాలో అనేక సంఘటనలు జరుగుతున్న జిల్లా అధికారులు, రక్షణ శాఖలు అవగాహనా కల్పించడంలో విఫలం చెంధరణి గుర్తుచేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా కొల్చారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తే గ్రామంలో ఒకవర్గం ఉదేశ్యపూర్వకంగా అలార్లు సృష్టించాలని విగ్రహం ముందు కావాలనే అలార్లు సృష్టించాలని జెండాలు పాతరని మండిపడారు. ఒకవేళ అలార్లు సృష్టించే ఉదేశ్యం లేకుంటే విగ్రహం ఏర్పాటుకంటే ముందే జెండా పతేవరని గుర్తుచేశారు. రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల మహా నాయకుడు విగ్రహం ఏర్పాటు చేసేదాంట్లో అందరూ ఉత్సహంగా పాల్పంచుకోవాల్సింది పోయి ఉన్న విగ్రహం తొలగించే కుట్ర చేసే విధానం సరైనదికదాని, గ్రామంలో ఇరు వర్గాల మధ్య అలార్లు సృష్టించే వ్యక్తులకు రక్షణ శాఖ అవగాహనా కల్పిస్తూ నిర్మించిన అంబేద్కర్ విగ్రహానికి రక్షణ కల్పించాలని కోరారు. ఇరు వర్గాల మధ్య సంఖ్యత కుదిరివరకు గ్రామంలో, విగ్రహం వద్ద పోలీస్ పీకేటింగ్ ఏర్పాటు చేయాలనీ ఆయన కోరారు.

# బడుగు బలహీన వర్గాల
# ఆశాజ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్

**- చొప్పదండి ఎమ్మెల్యే**

**- డాక్టర్ మేడిపల్లి సత్యం**

**- విలాసాగర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**





వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఉత్సాహభరితంగా, జనసందోహం మధ్య సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితోనే సమాజంలో సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని,బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. యువత ఆయన ఆలోచనలను అవలంబించి అభివృద్ధి బాటలో సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు ఏనుగుల కనకయ్య, జోగు రవి, అంజన్ రావ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ వినోద్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమణా రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సుంకపాక విక్రమ్ బాబు, ఉపాధ్యక్షులు జోగు శంకర్, గౌరవ అధ్యక్షులు సుంకపాక ప్రవీణ్, రామస్వామి,అంజయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కల్లెపల్లి సతీష్, కొంకటి మధు, సుంకపాక సురేష్, గజ్జెల రాజు, దమ్మ వెంకటరమణ, మల్లిఖార్జున్, దావ కనకయ్య, దొబ్బల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# భూ వివాదాలు సత్వర పరిష్కారానికి
## భూ భారతి చట్టం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది

**మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) శుక్రవారం రామాయంపేట రైతువేదికలో భూ భారతి చట్టం రెవెన్యూ అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసిల్దార్ రజని, ప్రజా ప్రతినిధులు రైతులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. భూ భారతి నూతన చట్టంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కష్టాలను తీర్చే ప్రభుత్వంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ధరణి విషయమై మాటను ఇచ్చారని, ధరణి స్థానంలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు, ప్రజలకు ఉపయోగపడే నూతన భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చారని అన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు, ప్రజల అభిప్రాయాలను తీసుకున్న తదపరి భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. రైతులు వారి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే విధంగా పగడ్బందీగా ఈ చట్టాన్ని అమలు చేసేందుకు జిల్లాలో రెవెన్యూ యంత్రాంగం పనిచేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి పేదవాని ఆకలి తీర్చేందుకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించి వారు ఉన్నత స్థానంలో స్థిరపడాలనే ఉద్దేశంతో రామాయంపేట పట్టణంలో 200 ఎకరాలలో పాఠశాలల నిర్మించి విద్యాభివృద్ధికి కృషి చేయనున్నట్లు చెప్పారు. భూ భారతి చట్టంపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భూ భారతి చట్టం మార్గదర్శకాలను రైతులు, ప్రజలకు తెలియజేసేందుకు జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భూ భారతి చట్టంలో భూ సమస్యల పరిష్కారం కోసం కొత్త రూల్స్ వచ్చాయన్నారు. నూతన చట్టం రూల్స్ గురించి తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లకు, ఆర్ఐలకు కలెక్టరేట్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ నూతన చట్టం భూ భారతి, దానిలోని అంశాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఇంతకు ముందు ఉన్న ధరణిలో కోల్పోయిన భూ హక్కులు ఏవైతే ఉన్నాయో ఇప్పుడు వచ్చిన కొత్త చట్టంలో ఎలాంటి హక్కులు ఉన్నాయనేది తెలియజేసేందుకే ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న రైతులు, ప్రజలు ఇంతకు ముందు ధరణిలో ఎలాంటి హక్కులు ఉన్నాయి, ఇప్పుడు భూ భారతి చట్టంలో ఎలాంటి హక్కులు ఉన్నాయనే అంశాల గురించి అడిగిన సందేహాలపై అవగాహన కల్పించారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో నూతనంగా వచ్చిన భూ భారతి చట్టం గురించి ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా స్థాయిలో రైతులకు, ప్రజలకు లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు. నూతన చట్టం ద్వారా తప్పులు సవరించుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే తహసీల్దార్ రిపోర్ట్ మొదలుకొని ఆర్డిఓ, కలెక్టర్, ఆపైన సిసిఎల్ఏ వరకు అప్లై చేసుకునే అవకాశం ఉందన్నారు. త్వరలోనే గ్రామ పాలన అధికారులను ప్రభుత్వం నియమించనుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , అదనపు కలెక్టర్ నాగేష్ , ఆర్డీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు .

# వరి ధాన్యం కొనుగోలులో రైతుకు
# ఏ ఇబ్బంది లేకుండా సేకరణ చేపడతాం..

**-ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**



మంథని ( ప్రశ్న న్యూస్) వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఏ ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపడతామని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెంకటాపూర్, అడవిసోమన్ పల్లి, ఖాన్ సాయి పేట్, సిరిపురం, గుంజపడుగు, నాగారం, కన్నాల, విలోచవరం, సూరయ్యపల్లి, కాకర్లపల్లి వరి ధాన్యం కేంద్రాలను సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఆరెంద కేంద్రాన్ని సంఘ డైరెక్టర్ గడ్డం పోచం, మల్లారం కేంద్రాన్ని డైరెక్టర్ పెద్దిరాజు ప్రభాకర్, స్వర్ణపల్లి కేంద్రాన్ని డైరెక్టర్ సిరిమూర్తి ఓదెలు, నాగేపల్లి కేంద్రాన్ని డైరెక్టర్ రావికంటి సతీష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సూచనలను తూచా తప్పకుండా పాటిస్తూ రాష్ట్రంలోనే అధిక మొత్తంలో ధాన్యం సేకరిస్తామని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల జాగ్రత్తలు పాటిస్తూ రైతుల నుంచి సేకరణ చేపడతామని అన్నారు. రైతులు వరి ధాన్యం కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో సంఘ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రాజబాపు, లెక్కల కిషన్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మీ-మొండయ్య, ఉడుత మాధవి-పర్వతాలు యాదవ్, దేవళ్ల విజయ్ కుమార్, నాయకులు ఊట్ల అనిల్, మానేం సత్యనారాయణ, కొండ మహేందర్, జనగామ సదువలి, కొటారి బాపు,మండపు మధు, కుదుధుల కోటయ్య, సత్యనారాయణ, మహదేవ్, మాసిరెడ్డి రాజిరెడ్డి, రాజేంద్ర ప్రసాద్, గూడెపు శ్రీనివాస్, తాళ్ళ సత్యనారాయణ, మహేందర్, బెజ్జంకి మల్లయ్య, ,బొమ్మ సత్తయ్య, రమేష్, సంఘ సెక్రటరీ మామిడాల ఆశోక్ కుమార్,పెద్ద సంఖ్యలో రైతులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ సహనం శాంతికి నిర్వచనం క్రీస్తు

**-మానవాళి పాప పరిహార్థం క్రీస్తు సిలువ మరణం -పాస్టర్ దూడ మహేష్**




మంథని (ప్రశ్న న్యూస్) ప్రేమ సహనం శాంతికి నిర్వచనం క్రీస్తు ప్రభువు అని, ఆయన చూపించిన మార్గంలో అందరు నడుస్తూ ప్రపంచం శాంతిమయం కావాలని, క్రీస్తు బోధనలు ప్రపంచశాంతికి దిక్సూచి అని, యేసు అనుగ్రహం అందరిపై ఉండాలని పాస్టర్ దూడ మహేష్ పేర్కొన్నారు. క్రైస్తవుల పర్వదినం గుడ్ ఫ్రైడే పండుగ సందర్భంగా శుక్రవారం మంథని మున్సిపల్ పరిధి శ్రీపాద కాలనీ గల సీయోను చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ మానవాళి పాప పరిహార్థం క్రీస్తు సిలువ మరణం పొందాడని, ప్రేమ, సహనం, శాంతికి నిర్వచనం యేసు క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దిక్సూచి అని, మానవవాళికి ప్రేమ, శాంతిమార్గం చూపిన మహనీయుడు యేసుక్రీస్తు అని అన్నారు. అతడి అనుగ్రహం అందరిపైనా ఉండాలని తెలిపారు. జీసస్ బోధనలతో ప్రపంచ శాంతి మయం కావాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఏసుక్రీస్తు ప్రభువు సత్యాన్ని ఏనాడు విడనాడలేదని, తను నమ్మిన సిద్ధాంతం కోసం, తన భక్తుల కోసం ప్రాణాలు అర్పించిన గొప్పమహా నీయుడని ఆయనను కొనియాడారు. క్రీస్తు బోధనలు అందరూ అవగతం చేసుకొని, సన్మార్గంలో ముందుకెళ్లాలని ఆయన తెలిపారు. యేసు దైవత్వము సంబం ధించిన విద్యను క్రిస్టోలోజి అని పిలు స్తారని, చరిత్రకారులు మానవ చరిత్రను యేసు క్రీస్తు జీవించిన కాలాన్ని కొల మానంగా తీసుకుంటారు. క్రీస్తు జన్మించకముందు కాలాన్ని క్రీస్తుపూర్వం అని, క్రీస్తు జన్మించిన తర్వాత కాలనీ క్రీస్తుశకం అని పేర్కొంటారని వివరించారు. క్రీస్తు ప్రభువు సూచించిన మార్గంలో నడుస్తూ ప్రతి ఒక్కరి హృదయాల్లో ప్రేమ నిండాలని తెలిపారు. ప్రేమ, కరుణ, క్షమాగు ణాలను ఏసు తన జీవిత సందేశంగా మానవాళికి అందించారు.. ప్రతి మనిషి పరోపకార గుణం అలవరుచుకోకపోతే జీవితానికి అర్థం ఉండదన్నారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ద్యానించారు. అనంతరం శ్రీపాద కాలనీ చర్చి నుండి అంబేద్కర్ చౌక్ వరకు సిలువ ధ్యాన సువార్త ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ మంథని మార్క్, అజ్మీరా దయారాజు, కలువల సామ్యూల్, గద్దల రాజేష్, కాంపెల్లి దాస్, సంఘ పెద్దలు అంకరి కుమార్, ఎం కే జోసెఫ్, మంథని ప్రసాద్, అందే రమేష్, చింతకుంట్ల ప్రేమ్ కుమార్, దాసరి సదానందం, రాముగిరి కుమార్, ఈర్ల సదా నందంతో పాటు స్త్రీల కమిటీ నాయకులు హేమలత పద్మజ ప్రేమాలత తదితరులు పాల్గొన్నారు.

# ఉప ఎన్నికల బరిలో కవిత

## – సిట్టింగ్ సీటు దక్కుతుందా.?



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** పార్టీ మారితే పవర్ వస్తుందనుకున్న ఎమ్మెల్యేలను అనర్హత వేటు టెన్షన్ వెంటాడుతోంది. వేటు పడితే మాత్రం ఉప ఎన్నిక జరగడం ఖాయం. అయితే ఓ నియెజకవర్గంలో బై ఎలక్షన్ వస్తే మాత్రం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రంగంలోకి దిగబోతున్నారనే చర్చ ఇప్పుడు జోరందుకుంది. పార్టీ క్యాడర్ సైతం కవిత పోటీ చేయాలని డిమాండ్ చేస్తోందట. అదే జరిగితే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కంటే వారిద్దరి మధ్య జరిగే బై ఎలక్షన్ పోరు తెలంగాణ రాజకీయాలను మరింత హీటెక్కించడం ఖాయంగా కన్పిస్తోంది. ఇంతకీ అనర్హత వేటు లిస్టులో ఉన్న ఆ ఎమ్మెల్యే ఎవరు? ఎమ్మెల్సీ కవిత పోటీ చేస్తే సిట్టింగ్ సీటు దక్కుతుందా? ఇంతకీ కవిత పోటీకి దిగాలని కోరుతున్న ఆ నేత ఎవరు? వాచ్ దిస్ స్టోరీ. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఇప్పుడు బై ఎలక్షన్ టెన్షన్ పట్టుకుంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కండువాను మార్చేశారు. బీఆర్ఎస్ పార్టీకే కాదు ఎమ్మెల్సీ కవితకు వీర విధేయుడిగా ఉన్న సంజయ్ కుమార్ పార్టీ మారుతాడని ఎవరూ ఊహించ లేదు. ఐతే ఎమ్మెల్యేల పార్టీ మార్పును సవాల్‌గా తీసుకున్న బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో కేసు వేసింది. దీనిపై ప్రస్తుతం సుప్రీం ధర్మాసనం విచారిస్తోంది.దీంతో సంజయ్‌కు బై ఎలక్షన్ టెన్షన్ పట్టుకుందట. ఎందుకంటే ఓ వైపు బీఆర్ఎస్ నుంచి విమర్శలు రోజురోజుకి తీవ్రతరం అవుతుంటే మరో వైపు కాంగ్రెస్ నాయకులు సంజయ్ రాకను ఇప్పటికీ బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు అంతేకాదు జగిత్యాలలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి సంజయ్‌కి అస్సలు పొసగడంలేదనేది బహిరంగరహస్యం. అధిష్టానం ఇద్దరి మధ్య రాజీకుదర్చాలని ప్రయత్నించినా జీవన్ రెడ్డి మాత్రం వెనక్కి తగ్గడంలేదటఇలాంటి పరిస్థితుల్లో జగిత్యాలలో ఉప ఎన్నిక వస్తే పరిస్థితి ఏంటనే టెన్షన్‌లో సంజయ్ ఉన్నారని లోకల్ టాక్. 2014 ఎన్నికల్లో జగిత్యాలలో బీఆర్ఎస్ తరపున పోటీచేసిన సంజయ్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత 2018 ఎన్నికల్లో గెలిచారు. అయితే సంజయ్ గెలుపు కోసం కవిత అంత కష్టపడినా చివరకు సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. దీంతో పార్టీ మారిన సంజయ్ ని ఓడిరచి రివేంజ్ తీసుకోవాలనుని కవిత భావిస్తున్నట్లు లోకల్ టాక్.సుప్రీంకోర్టు తీర్పుతో ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే జగిత్యాల నియోజకవర్గంలో తాను పాదయాత్ర చేసి కవితను గెలిపించుకుంటామని ఎమ్మెల్సీ రమణ చేసిన వాఖ్యలు ఇప్పుడు చర్చనీయంశంగా మారాయి. ఇప్పటికిప్పుడు ఉప ఎన్నిక వస్తే..జగిత్యాలలో కవిత, సంజయ్ ప్రత్యర్థులుగా నిలబడతారనే టాక్ విన్పిస్తోంది.అయితే సంజయ్ రాకను వ్యతిరేకించిన మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి?బై ఎలక్షన్లో సంజయ్ కి సపోర్ట్ చేస్తారా? లేదా అనేది ఆసక్తికరంగా మారనుంది. జీవన్ రెడ్డి గురించి తెలిసిన వారు మాత్రం ఖచ్చితంగా సపోర్ట్ చేయరంటూ ఓపెన్ గానే చెప్తేస్తున్నారంట. ఒకవేళ ఉప ఎన్నికల్లో జీవన్ రెడ్డి తనకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తే మాత్రం సంజయ్ పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారినా.. కవిత అనుచరులు, పార్టీ క్యాడర్ మాత్రం అలానే ఉన్నారు. జగిత్యాల అభ్యర్థిగా కవిత రంగంలోకి దిగితే వార్ వన్ సైడే అంటోంది గులాబీ దళం. నాడు సంజయ్ గెలుపు కోసముమ్మర ప్రచారం చేసిన కవిత? ఇప్పుడు తన గెలుపు కోసం ఏ రేంజ్ లో ప్రచారం చేస్తారో ఊహించుకోండి అంటున్నాయట పార్టీ శ్రేణులు. ఒకవేళ బై ఎలక్షన్స్ వస్తే జగిత్యాల జగడం రసవత్తరంగా మారనుంది.

# ‘చుక్క’ బాబులకు చిక్కులే.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆదివారం వచ్చిందంటే చాలు మందు బాబులకు మొక్క లేనిదే ముద్ద దిగదు. ఈ ముక్కతోపాటు చుక్క కూడా ఉండాలని చాలామంది కోరుకుంటారు. అందుకే ప్రతి ఆదివారం మద్యం అమ్మకాలు పుంజుకుంటాయి. అయితే ఇప్పుడు సాధారణ రోజుల్లోనూ మద్యం అమ్మకాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా వేసవి కాలం కావడంతో చల్లదనం కోసం చాలామంది బీర్లను కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల బీర్ల ధరలు 10 నుంచి 20% పెంచినా వాటి కొనుగోళ్ళు మాత్రం తగ్గలేదు. అయితే ఇప్పుడు లిక్కర్ ధరలు కూడా పెంచేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతుంది. దీంతో చుక్క బాబులకు చిక్కులే అని కొందరు అంటున్నారు. ఇంతకీ మద్యం రేట్లు ఎంతగా పెరుగుతున్నాయి అంటే? వేసవికాలంలో ఎక్కువగా మద్యం అమ్మకాలు పెరిగే అవకాశం ఉంది. సెలవులు ఉండటం తో పాటు కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించుకోవడం వల్ల మద్యం అమ్మకాలు పుంజుకోనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సైతం ఆదాయాన్ని పెంచుకునేందుకు మద్యం రేట్లు పెంచేందుకు సమాయత్తమవుతుంది. గత ఫిబ్రవరిలో బీర్లపై పది నుంచి 20% పెంచింది. దీంతో బీర్ల అమ్మకాలు తగ్గుతాయని చాలామంది అనుకున్నారు. కానీ ధరలతో సంబంధం లేకుండా చాలామంది బీర్లను ఎప్పటిలాగే కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇప్పుడు లిక్కర్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ లిక్కర్ దారులు సామాన్యులపై భారం కాకుండా పెంచాలని చూస్తున్నారు. అంటే లిక్కర్ కనీసం రూ. 500 పైన ఉన్న వాటిపైనే ధరలు పెంచే అవకాశం ఉంది. ఆలోపు ధరలు పెరగవాని తెలుస్తుంది. లిక్కర్ తయారీకి ఉపయోగించే ముడి సరుకుల ధరలు పెరగడంతో మద్యం తయారు చేసే కంపెనీలు ధరలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మద్యం ధరలను 15% పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది.అయితే ధరలు ఎక్కువ శాతం బ్రాండ్లపైనే పెంచే అవకాశం ఉన్నందున వాటి అమ్మకాలు సాధారణంగానే ఉంటాయని భావిస్తున్నారు. అంతేకాకుండా బ్రాండ్లు ధరలు పెరిగితే పెద్దగా పట్టించుకునే అవకాశం ఉండదని అంటున్నారు. తక్కువ ధర లిక్కర్ పై ధరలు పెంచడం వల్ల ప్రభావం పడుతుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కువ ధర కలిగిన బ్రాండ్లపైనే ధరలు పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ ధరలు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయి.? ఏ ఏ బ్రాండ్లపై ధరలు పెరుగుతాయి అనేది త్వరలో నిర్ణయించబడుతుంది. కరోనా సమయంలో లిక్కర్ ధరలు భారీగా పెరిగాయి. ఆ తర్వాత మరోసారి తక్కువ మొత్తంలో పెంచారు. అయితే ఇప్పుడు ధరలు పెరగడంతో అమ్మకాల పరిస్థితి ఎలా ఉంటుందో అని కొందరు చర్చించుకుంటున్నారు. అయితే ప్రస్తుతం వేసవి కావడంతో వీళ్ళ అమ్మకాలు ఎక్కువగా ఉంటాయని లిక్కర్ ధరలు పెరిగితే అమ్మకాలపై ప్రభావం ఉండే అవకాశం ఉందని మరికొందరు అంటున్నారు. కానీ ఖర్చుల నేపథ్యంలో ధరలు పెంచడం తప్ప వేరే మార్గం లేదని కంపెనీలు తెలుపుతున్నాయి. మరి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



# రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజా ప్రశ్న కథనాలకు స్పందించి రేషన్ మాఫియా పై ఉక్కుపాదం మోపుతున్న అధికారులు**

**నాయుడుపేటలోని మునిరత్నం నగర్ సమీపంలో జాతీయ రహదారిపై**

**అక్రమ తమిళనాడు రేషన్ బియ్యం పట్టివేత**

- **ఆటోలో సులూరుపేట వైపు నుంచి కోట వైపు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు**
- **పట్టుబడిన ఆటోలో సుమారు పది బస్తాల తమిళ్ రేషన్ బియ్యం గుర్తింపు**
- **ఆటోతో సహా తమిళ రేషన్ బియ్యం పోలీస్ స్టేషన్ తరలింపు**

**పత్రిక కథనాలకు స్పందించిన అధికార యంత్రాంగం**






**నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్ )** “ప్రజా ప్రశ్న “తెలుగు జాతీయ దినపత్రిక లో ప్రచారం అయ్యే కథనాలకు అధికారులు స్పందిస్తూ రేషన్ మాఫియా పై ఉక్కు పాదం మోపుతున్నారు పోలీసులు. ఇటీవల ప్రజా ప్రశ్న తెలుగు జాతీయ దినపత్రికలో ఇటీవల రేషన్ మాఫియా పై ప్రత్యేక కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. కథనాలకు అధికార యంత్రంగా స్పందించి చర్యలు చేపట్టడం మొదలు పెడుతున్నారు. వివరాల్లోకి వెళితే నాయుడుపేట పట్టణంలోని మునిరత్నం నగర్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.అక్రమంగా తరలిస్తున్న సుమారు పది బస్తాల తమిళరేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. నాయుడుపేటలోని మునిరత్నంనగర్ సమీపంలోని జాతీయ రహదారి వద్ద అక్రమంగా తమిళనాడు రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా తమిళ రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను పట్టుకున్నారు. ఆటోలో సుమారు పది బస్తాల తమిళరేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇలాంటి మంచి కథనాలు ఎన్నో ప్రజా ప్రశ్న తెలుగు జాతీయ దినపత్రికలో ప్రచురించాలని ఇలాంటి అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు ప్రజా ప్రశ్న తెలుగు జాతీయ దినపత్రికను ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.




ప్రజాప్రశ్న

అక్రమంగా కోట్లు సంపాదిస్తున్న

రేషన్ మాఫియా

# రేవంత్ రెడ్డికి తీన్మార్ మల్లన్న వార్నింగ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా నోటిఫికేషన్లు జారీ చేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుర్చీని లాగేస్తామని శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని భావించామని, కానీ నోటిఫికేషన్ల ద్వారా బీసీలకు అన్యాయం చేస్తే ఆయన పదవీ కాలం ముగిసినట్లేనని అన్నారు. బీసీ చైతన్య సభలో ఆయన మాట్లాడుతూ, రూ. 8 లక్షల ఆదాయం ఉంటే పేదవాడు, రూ. 2 లక్షల ఆదాయం ఉంటే ధనవంతుడు అనే విధంగా చట్టాలు రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవి ఏ రకమైన రిజర్వేషన్లు అని ప్రశ్నించారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను పూర్తిగా నిర్మూలించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఈడబ్ల్యుఎస్ వ్యవస్థ మనుగడలో లేకుండా చూస్తామని అన్నారు. పెట్టుబడుల కోసం రేవంత్ రెడ్డి ఒక బృందంతో జపాన్‌కు వెళ్లారని గుర్తు చేశారు. జపాన్‌లో వెయ్యి కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చారని విన్నామని, తెలంగాణలోని 2 కోట్ల మంది బీసీలు ఒక్కొక్కరు చాయ్ ఖర్చుల నిమిత్తం డబ్బులు ఇస్తే కోట్లాది రూపాయలు సమకూరేవని అన్నారు. పెట్టుబడుల కోసం అంత దూరం వెళ్లవలసిన అవసరం ఏముందని, బీసీలంతా కలిసి ఇచ్చేవారు కదా అని వ్యంగ్యంగా అన్నారు.రేవంత్ రెడ్డికి పరిపాలనాపరమైన జ్ఞానం లేకపోయినప్పటికీ, ముఖ్యమంత్రి పదవిలో ఉన్నందున ఆయనకు గౌరవం ఇస్తున్నామని అన్నారు. రేవంత్ రెడ్డికి పరిపాలనా రంగంలో అనుభవం లేదని, మోసం, కుట్ర, నయవంచన వంటి విషయాల్లో మంచి అనుభవం ఉందని విమర్శించారు. చైనా వస్తువులకు ఎంత గ్యారెంటీ ఉంటుందో, ఆయన పరిపాలనకు అంత గ్యారంటీ ఉంటుందని ఎద్దేవా చేశారు.

# వివాహేతర సంబంధం నేరం కాదు

## – ఢిల్లీ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** వివాహేతర సంబంధాన్ని నేరంగా చూడాల్సిన అవసరం లేదని, అది నైతికతకు సంబంధించిన అంశమంటూ గతంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను ఉదహరిస్తూ ఓ వ్యక్తి భార్య ప్రియుడికి ఢిల్లీ హైకోర్టు విముక్తి కలిగించింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని, ఓ హోటల్‌లో వారిద్దరూ శారీరకంగా దగ్గరయ్యారని మహిళ భర్త ఆరోపిస్తూ కోర్టుకెక్కాడు. ఈ కేసులో మేజిస్ట్రేట్ కోర్టు ప్రియుడిని విడిచిపెట్టేసింది. దీంతో బాధిత భర్త సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు. వాదనలు విన్న కోర్టు ప్రియుడికి సమన్లు పంపింది. దీనిని అతడు ఢిల్లీ హైకోర్టులో సవాలు చేశాడు. అక్కడ కూడా అతడికి అనుకూలంగానే తీర్పు వచ్చింది. ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యను భర్త ఆస్తిగా పరిగణించే మహాభారత కాలం నాటి భావజాలానికి కాలం చెల్లిందని పేర్కొంది. వివాహేతర సంబంధం నేరమంటూ ఐపీసీ 497 సెక్షన్ ఇచ్చిన నిర్వచనం రాజ్యాంగబద్ధం కాదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ ఉటంకించారు. వివాహేతర సంబంధం నైతికతకు సంబంధించిన అంశమని, దానిని నేరంగా చూడటం సరికాదని స్పష్టం చేస్తూ భార్య ప్రియుడికి ఈ కేసు నుంచి విముక్తి కల్పించారు.

# రజతోత్సవ సభపై కేసీఆర్ రివ్యూ



**ఎర్రవెల్లి (ప్రశ్న న్యూస్):** ఈ నెల 27 న వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభపై మాజీ సీఎం, గులాబీ బాస్ సమావేశం నిర్వహించారు. ఎర్రవెల్లి నివాసంలో బీఆర్ఎస్ నేతలతో శుక్రవారం ఈ సమీక్షా సమావేశం జరిగింది. సభలో మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు, సభ విజయవంతంలో వారి భాగస్వామ్యం, అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత సహా ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు, పార్టీ మహిళనేతలు, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హన్మకొండ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే లు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఒడితెల సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.? లాజిస్టిక్స్‌లో పెట్టుబడులను ఆహ్వానించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588